www.suryaa.com

17వ

సూర్య

కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జిల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా

మంగళవారం,13 ఆగస్టు 2024



# రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత సోమవారం నగరంలో పర్యటన





రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ : ఉదయం 9.30 గంటలకి తూర్పుగోదావరి జిల్లా సబ్ జైళ్ళ అధికారి వారి కార్యాలయం (కోటిపల్లి బస్టాండ్) సమీపంలో నిర్మించిన పెట్రోల్ బంకు ప్రారంభిస్తారు. అనంతరం కేంద్ర కారాగారం సందర్శన తదుపరి మధ్యాహ్నం 12 గంటలకు రాజమండ్రి సెంట్రల్ జైలు వద్ద నిర్మించిన ప్రిజన్ కేఫ్, బాక్స్ క్రికెట్ ప్రారంభిస్తారు. ముఖ్య అతిథులు రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత , పర్యటక శాఖా మంత్రి కందుల దుర్గేష్, జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాల రావు, పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి, జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, శాసన సభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాస్, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఎస్పి డి. నరసింహ కిషోర్, డి.ఐ.జి. ఆఫ్ ప్రిజన్స్ ఎం ఆర్ రవి కిరణ్, ఐ జి ఆఫ్ ప్రిజన్స్ డాక్టర్ ఐ. శ్రీనివాస రావు, రాజమండ్రి మున్సిపల్ కమిషనర్ కేతన్ గార్గ్ , కేంద్ర కారాగార పర్యవేక్షణాధికారి ఎస్ రాహుల్, తదితరులు పాత్రికేయ మిత్రులకి విందు మధ్యాహ్నం 12.30 నుంచి కేంద్ర కారాగార ఆవరణలో జరుగుతుంది.

# సబ్‌జైళ్లు, పోలీస్ స్టేషన్ల ఆధునీకరణకు చర్యలు

**– హోంమంత్రి అనిత**

**కొవ్వూరు, మేజర్ న్యూస్ :** రాష్ట్రంలోని అన్ని సబ్ జైళ్ల, పోలీస్ స్టేషన్లను ఆధునీకరించడానికి చర్యలు చేపడుతున్నామని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. సోమవారం నాడు హోం మంత్రి అనిత కొవ్వూరు నియోజకవర్గ దిసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణ నివాసానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో సబ్ జైలు, పోలీస్ స్టేషన్ లలో ఇబ్బందులు ఉన్న మాట నిజమేనని అటువంటి వాటిని గుర్తించి ప్రతిపాదనలు తయారు చేసే ప్రభుత్వానికి పంపామని అన్నారు. మాది ప్రజా ప్రభుత్వ మని నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటామని అన్నారు. కొవ్వూరు పట్టణ పోలీస్ స్టేషన్ నూతన భవన నిర్మాణానికి చర్యలు చేపడతామని అన్నారు.గత ప్రభుత్వం రోడ్ల అభివృద్ధి పనులు చేపట్టకుండా రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారని అన్నారు.గత ప్రభుత్వం చేసిన తప్పులు మా ప్రభుత్వం చేయదని మా ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి దిశగా పనిచేస్తుందని అన్నారు. పోలీస్ సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని తెలిపారు.

గత ప్రభుత్వం అన్ని వ్యవస్థలను భ్రష్టు పట్టించారని వాటిని ఒక్కొక్కటిగా పూర్తిచేసే పనిలో ఈ ప్రభుత్వం ఉందన్నారు. దిశ పోలీస్ స్టేషన్‌గా ఉన్న పేర్లను మహిళా పోలీస్ స్టేషన్లుగా మార్చడం జరిగిందని ఈ పోలీస్ స్టేషన్లలో మహిళా సిబ్బంది విధులు నిర్వహిస్తారని అన్నారు. కాబట్టి మహిళలు తమ ఇబ్బందులను, సమస్యలను నేరుగా మహిళా పోలీస్ స్టేషన్‌లోని అధికారులకు చెప్పుకోవచ్చు అని అన్నారు. గంజాయి రవాణా పై ఉక్కు పాదం మోపుతున్నామని ప్రత్యేక నిఘాతో పాటు సీసీ కెమెరాలను ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. గిరిజనులను గంజాయి సాగు నుండి దూరం చేయడానికి తగు చర్యలు చేపట్టామన్నారు. గంజాయి లేని రాష్ట్రంగా ఆంధ్ర ప్రదేశ్ ను తీర్చిదిద్దుతామని అనిత తెలిపారు. రాజమండ్రి, ఏలూరు,విజయవాడ లాంటి నగరాలలో బ్లేడ్



బ్యాచ్ ఎక్కువగా ఉందని వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు కొవ్వూరులో సబ్ జైలు ఏర్పాటు పట్టణ పోలీస్ స్టేషన్ నూతన భవన నిర్మాణం విషయాన్ని నా దృష్టికి తీసుకు వచ్చారని త్వరలో సబ్ జైలు ఏర్పాటు చేస్తామని కొవ్వూరు పట్టణ పోలీస్ స్టేషన్ ను మోడరన్ పోలీస్ స్టేషన్‌గా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడతామన్నారు. కొవ్వూరు నాకు పుట్టినిల్లు లాంటిదని కొవ్వూరు నియోజవర్గ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు పూర్తిస్థాయిలో అందిస్తానని అన్నారు. 2019లో నేను ఈ నియోజకవర్గం నుంచి పోటీ చేసినప్పుడు ఇక్కడి నాయకులు, కార్యకర్తలు,ప్రజలు పూర్తి సహాయ సహకారాలు అందించారన్నారు. నేను ఎప్పటికీ ఈ నియోజకవర్గాన్ని మరువనాన్ని అనిత తెలిపారు. కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, నిడదవోలు మాజీ ఎమ్మెల్యే బురుగుపల్లి శేషారావు, దిసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, కంఠమణి రామకృష్ణ,మద్దిపట్ల శివరామకృష్ణ, కొవ్వూరు నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ టివి. రామారావు, మారిశెట్టి వెంకటేశ్వరరావు, సూర్యదేవర రంజిత్, దేగల రాము తదితరులు పాల్గొన్నారు.

# ఆదిత్య డిగ్రీ కళాశాలలోగ్రంథ పాలకుల దినోత్సవం





**– మనో వికాసానికి పుస్తక పఠనమే ఆధారం**

**– డాక్టర్ నాయుడు**

**కాకినాడ, మేజర్ న్యూస్ :** స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలల గ్రంథాలయ విభాగం ఆధ్వర్యంలో గ్రంథ పాలకుల దినోత్సవం నిర్వహించినట్లు ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఈ.వి.ఎల్. నాయుడు తెలిపారు.ఆదిత్య డిగ్రీ కళాశాలలో గ్రంథ పాలకుల దినోత్సవం కార్యక్రమానికి విచ్చేసిన డాక్టర్ నాయుడు ఎస్.ఆర్ రంగనాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి మాట్లాడుతూ ఆధునిక గ్రంథాలయానికి రూపకల్పన చేసిన ఎస్.ఆర్ రంగనాథన్ జయంతిని పురస్కరించుకొని ప్రతి సంవత్సరం ఆగస్టు 12న గ్రంథ పాలకుల దినోత్సవం జరుపుకుంటారని అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో గ్రంథాలయాల స్థాపనకు, గ్రంథాలయ ఉద్యమాల ప్రచారంలో రంగనాథన్ చేసిన కృషి ఎనలేనిదని తెలిపారు. 'ఫైవ్ లాస్ ఆఫ్ లైబ్రరీ సైన్స్' అనే పుస్తకాన్ని రచించి, 1933లో ఇండియన్ లైబ్రరీ అసోసియేషన్ స్థాపనకు కృషి చేశారని తెలియజేశారు. విద్యార్థులు పుస్తక పఠనం మెరుగుపరుచుకోవాలని అన్నారు. మనోవికాసానికి పుస్తక పఠనమే ఆధారమని తెలిపారు. చీఫ్ లైబ్రేరియన్ డాక్టర్ ఎస్.వి.ఆర్. ప్రభాకర్ మాట్లాడుతూ ఆధునిక కాలంలో ప్రతి ఒక్కరి చేతిలో మొబైల్ రూపంలో ఇంటర్నెట్ సదుపాయం అందుబాటులో ఉన్నప్పటికీ పుస్తకాల అధ్యయనం ద్వారా లభించే జ్ఞానం ఎంతో విలువైనదని తెలిపారు. ఆదిత్య డిగ్రీ కళాశాలలో అధ్యాపకులకు, విద్యార్థులకు సంబంధిత పుస్తకాలతో పాటు, ఇ బుక్స్, ఇ-జర్నల్స్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ నాయుడు గ్రంథాలయ నిర్వాహకులుగా సేవలందిస్తున్న గ్రంథ పాలకులను దుస్సాలువతో సత్కరించారు.

ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన గ్రంథాలయ విభాగ బృందాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సత్యనారాయణ, క్యాంపస్ ఇంచార్జ్ ఎన్ మూర్తి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు టి.తేజేశ్వరరావు, ఎల్.దివాకర్‌రావు, లైబ్రేరియన్స్ జి.నేరెళ్ల రెడ్డి, కే.సూర్యనారాయణ, పి.పోలారావు, సుజాత, ఏ.బాలాజీ, విజయలక్ష్మి మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక



కాకినాడ, మేజర్ న్యూస్ : కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాలతో జిల్లా పోలీస్ కార్యాలయంలో సెబ్ అడిషనల్ ఎస్పీ కె.శ్రీలక్ష్మి ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. సోమవారం కాకినాడ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ కె. శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమమునకు 48 మంది ఫిర్యాదుదారులు హాజరై తమ సమస్యలను సెబ్ అడిషనల్ ఎస్పీకి తెలియచేసు కున్నారు. ఫిర్యాదులను స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకుని, సంబంధిత పోలీస్ అధికారులతో నేరుగా మాట్లాడి, సకాలంలో సమస్యలు పరిష్కరించవలసిందిగా సెబ్ అడిషనల్ ఎస్పీ కె.శ్రీలక్ష్మి సూచించారు.

## గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



**పెదపూడి, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన కళ్యాణ్‌ల ఆశయ సాధన మేరకు గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణకు అధికారులు పెద్ద పీట వేయాలని పెదపూడి ఎంపీపీ కేతా తులసి అన్నారు. పెదపూడి మండల పరిషత్ కార్యాలయంలో మూడు రోజులు పాటు నిర్వహించే కార్యదర్శుల, సర్పంచ్‌ల శిక్షణ సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పంచాయితీ వ్యవస్థ బలోపేతం కు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు వివరించారు. మండలాన్ని డ్రగ్ రహితంగా మార్చేందుకు దృఢ సంకల్పం తీసుకోవాలని, దేశాన్ని మాదకద్రవ్యాల రహితంగా మార్చడానికి తమ శక్తి మేరకు తాము చేయగలిగినదంతా చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో ఆశాజ్యోతి, ఇఓ పి ఆర్డీ ఎం ఎస్ ఎన్ రెడ్డి, కార్యదర్శులు బి. ప్రసన్న, మన్యం శ్రీనివాసరావు, సర్పంచ్ లు పాల్గొన్నారు.

## పట్టుబడిన గుడి హుండీ దొంగలు

**– రూ.33,000 సొమ్మును రికవరీ**

**పి.గన్నవరం, మేజర్ న్యూస్ :** ఆదివారం మధ్యాహ్నం సమయంలో ఉడిమూడి నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి వద్ద, రాబడిన సమాచారం మేరకు వెహికల్ చెకింగ్ చేయగా పి గన్నవరం పోలీస్ స్టేషన్ కేసు 106/24 కేసులో ముద్దాయిలైన ముగ్గురు ఆసాములును కాలే మాణిక్యాలరావు, ఏడిద గ్రామం, మండపేట మండలం, కాలే సుబ్రహ్మణ్యం, ఏడిద గ్రామం, మండపేట మండలం, యలమంచిలి దినేష్, కలవల పల్లి గ్రామం,చాగల్లు మండలం పట్టుకుని వారి వద్ద నుంచి 33,000 సొమ్మును రికవరీ చేసుకుని మరియు వారి వద్ద నుండి ఒక కంప్యూటర్, 8 మైక్ యంప్లిఫైర్, ఒక కూలర్ ,ఒక ఇన్వర్టర్ బ్యాటరీ, సెల్ ఫోన్ ఆక్సిరీస్ స్వాధీంచేసుకోవడమైంది. అదేవిధంగా వారు గత నెల 18వ తేదీ నాడు వద్రేవులపల్లి మరియు నాగులంక రోడ్డు ప్రక్కన ఉన్న గుడిలోని హుండీలను పగలకొట్టి అందులోని సొమ్ము దొంగలించినారని, వారిపై వివిధ పోలీస్ స్టేషన్ లలో 10 కేసులు నమోదు అయినవని,. సోమవారం వారిని రిమాండ్ నిమిత్తం అమలాపురం కోర్టులో హాజరు పరచడమైనదని పి.గన్నవరం ఎస్.ఐ. శివకృష్ణ తెలిపారు.

# సెంట్రల్ జైలు సిబ్బందికి ఆరోగ్య భద్రత కల్పిస్తాం



**– గంజాయి కేసులపై ఎక్కువ దృష్టి సారిస్తున్నాం**

**– సైకియాట్రిస్టులను అందుబాటులో ఉంచుతాం**

**– ఇకనుంచి మహిళా పోలీసు స్టేషన్లగానే దిశ స్టేషన్లు**

**– ప్రిజన్స్ కేఫ్ ప్రారంభించిన హోం విపత్తుల నిర్వహణ హోమ్ శాఖ మంత్రి వంగలపూడి అనిత**

**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** క్షణికావేశంలో చేసిన తప్పులకు జైలు జీవితం గడుపుతున్న ఖైదీలు బయటకు వెళ్ళాక నేర ప్రవృత్తివైపు వెళ్లకుండా ఉండేందుకు ఫ్యూయల్ అవుట్ లెట్స్, ప్రిజన్ కేఫ్స్ వంటివి ఏర్పాటు చేస్తున్నామని రాష్ట్ర విపత్తుల నిర్వహణ మరియు హోం శాఖ మంత్రి వంగలపూడి వనిత పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఇన్నిస్ పేట సమీపంలో వున్న సబ్ జైలు ఆవరణలో ఏపి ప్రిజన్స్ శాఖ ఆధ్వర్యంలో పెట్రోల్ బంకు ప్రారంభించిన అనంతరం సెంట్రల్ జైలు, మహిళా జైలు సందర్శించారు. ఈ సందర్భంగా సెంట్రల్ జైలు ఎదురుగా ఏర్పాటుచేసిన ప్రిజన్స్ కేఫ్‌ని మంత్రి అనిత ప్రారంభించారు. అనంతరం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో హోమ్ మంత్రి అనిత మాట్లాడుతూ మానవతా దృక్పథంతో ఖైదీలకు మంచి ప్రవర్తన కల్గించడంలో భాగంగానే ప్రిజన్స్ కేఫ్, పెట్రోలు బంకు ప్రారంభించినట్లు తెలిపారు. రాష్ట్రంలో 16సబ్ జైళ్లు, రెండు సెంట్రల్ జైళ్లు, ఒక స్పెషల్ జైలు ఉండగా, ఒక బోస్టన్ జైలు కడుతున్నట్లు వివరించారు. జైళ్లలో మొత్తం 3వేల 483మంది ఖైదీలు ఉన్నారని, ఉండాల్సిన సంఖ్య కంటే అధికంగా 700 మంది ఉన్నారని మంత్రి తెలిపారు. రాజమండ్రిలో 1200 మంది సామర్ధ్యానికి అదనంగా 50మంది ఉన్నారన్నారు. తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత గంజాయి కేసులపై ఎక్కువ దృష్టి పెట్టామని, రాష్ట్రంలో 1700మందిని అరెస్టు చేయగా, అందులో ఒక్క విశాఖలోనే వెయ్యిమంది వరకు ఉన్నారని, అలాగే రాజమండ్రి జైలులో 376మంది ఉన్నారని హోం మంత్రి అనిత చెప్పారు. గంజాయి కేసుల్లో అరెస్టయిన వారికోసం సైకిట్రిస్టులను ఏర్పాటుచేసి, అవగాహన కల్పించడంతో పాటు డీ ఎడిక్షన్ సెంటర్స్ కూడా పెట్టాలని భావిస్తున్నట్లు ఆమె చెప్పారు. సెంట్రల్ జైలు, మహిళా జైలు చూసాక అక్కడి ఇబ్బందులు , సౌకర్యాలు గురించి తెలుసుకున్నామని ఆమె తెలిపారు. ముఖ్యంగా స్నేహ బ్లాక్ చూసిన తర్వాత భావోద్వేగానికి గురయ్యామని హోం మంత్రి అనిత చెప్పారు. ఈ రాష్ట్రాన్ని సుదీర్ఘ కాలం పాలించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని చేయని నేరానికి 53 రోజులపాటు జైలులో ఉంచడం దారుణమని అందుకే ఆయనని పెట్టిన స్నేహ బ్లాక్ ని చూడగానే తట్టుకోలేకపోయానని చెప్పారు. అలాగే ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసుని కూడా గతంలో అరెస్టు చేసి పెట్టిన బరాక్ కూడా చూశామని ఆమె తెలిపారు. అప్పుడు మా నాయకుడిని అరెస్టు చేసినపుడు ఎంతగానో బాధపడ్డామని ఇప్పుడుఅదే జైలుకి సందర్శనకు వచ్చామని ఆమె వివరిస్తూ, రోజులు అన్నీ ఒకేలా ఉండవన్నారు. అదే ప్రజాస్వామ్యం గొప్పతనమని అన్నారు. ఏ తప్పు చేయనివాడు అందులోకి వెళ్లకూడదన్నదే తమ భావనగా ఆమె చెప్పారు. ఇక జైలు సిబ్బంది చెప్పిన విషయాలు, సమస్యలు తెలుసుకున్నామని, ముఖ్యంగా సివిల్ పోలీసుల మాదిరిగా ఆరోగ్య భద్రత కల్పించాలని కోరారని, ఇప్పటివరకు ఆరోగ్య భద్రత లేకపోవడం శోచనీయమని ఆమె పేర్కొంటూ వెంటనే ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి ఆరోగ్య భద్రత కల్పించనున్నట్లు ఆమె తెలిపారు. ఖైదీలకు క్షమాభిక్ష గత ఐదేళ్లలో అసలు పట్టించుకోలేదని హోం మంత్రి అనిత గుర్తుచేస్తూ క్షమాభిక్ష ఇచ్చే విషయంలో త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. గత 24ఏళ్లుగా జైలులో ఉండిపోయానంటూ ఒక ఖైదీ తన దృష్టికి తెచ్చాడని ఆమె పేర్కొన్నారు. అలాగే పెరోల్ నిబంధనలను కూడా సమీక్షిస్తామన్నారు. గతంలో ఒక వ్యక్తి ష్యూరిటీ ఇస్తే సరిపోయేదని, ఈ నిబంధన మార్చడం వలన ఇబ్బంది వస్తోందని గమనించామని ఆమె చెబుతూ దీన్ని సమీక్షించి నిర్ణయం తీసుకుంటామన్నారు. దిశ చట్టమే లేకుండా దిశా పోలీసు స్టేషన్లు పెట్టడంలో అర్ధం లేదని హోమ్ మంత్రి పేర్కొంటూ గతంలో మాదిరిగా మహిళా పోలీస్ స్టేషన్లుగానే వ్యవహరించనున్నట్లు ఆమె స్పష్టం చేసారు. ఐదేళ్లుగా ఒక విధానంలో వెళ్ళినపుడు మార్పు రావడానికి కొంత సమయం పడుతుందని, మొత్తం మీద ఫ్రెండ్లీ పోలీసింగ్ వ్యవస్థను మళ్ళీ తీసుకొస్తున్నట్లు ఆమె చెప్పారు. పోలీసుల్లో శారీరక దృఢత్వాన్ని పెంచే దిశగా నెట్ ప్రాక్టీస్ క్రికెట్ ను మంత్రి అనిత ప్రారంభించి బ్యాట్ తో క్రికెట్ ను ఆడగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు బౌలింగ్ చేయడం విశేషం. ఈ కార్యక్రమంలో హోం మంత్రి వెంట ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఆదిరెడ్డి వాసు, జైళ్ల ఐజి విశ్వజిత్, డి.ఐ.జి. ఆఫ్ ప్రిజన్స్ ఎం ఆర్ రవి కిరణ్, సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ రాహుల్, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థి యువత నైపుణ్య వంతులు కావాలి

**– కె.శివకుమార్**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం, యూత్ రెడ్ క్రాస్ వింగ్ మరియు కాకినాడ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జా తీయ యువ దినోత్సవం నిర్వహించినట్లు ఆదిత్య డిగ్రీ మరియు పీ జీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి ఈ వి ఎల్ నాయుడు తెలిపారు. ఆదిత్య డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ యువ దినోత్సవం జరిగింది. " స్థిరమైన అభివృద్ధి కోసం యువత డిజిటల్ మార్గాలు" అనే నినాదంతో ప్రారంభమైన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కాకినాడ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సెక్రటరీ కె శివకుమార్ మాట్లాడుతూ విద్యార్థి యువత నైపుణ్య వంతులు కావాలని అన్నారు. యువత స్వామి వివేకానందను మార్గదర్శకంగా తీసుకొని, ఆరోగ్యకరమైన,అనుకూల ఆలోచనలతో ఆరోగ్య భారత్ నిర్మాణానికై కృషి చేయాలని పిలుపునిచ్చారు. నేటి యువత సాంకేతిక పరిజ్ఞానంలో ఎంతో ముందున్నారని, యువతను పెడదోవ పట్టించే అసాంఘిక శక్తులు పొంచి ఉన్నాయని వాటి పట్ల జాగ్రత్త వహిస్తూ లక్ష్య సాధన వైపు పయనించాలని అన్నారు. యువత రక్తదానం చేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. డైరెక్టర్ డాక్టర్ నాయుడు మాట్లాడుతూ 2000 సంవత్సరం నుండి అంతర్జాతీయ యువ దినోత్సవం నిర్వహించాలని ఐక్యరాజ్య సమితి ప్రపంచ దేశాలకు పిలుపునిచ్చిందని అన్నారు. యువ శక్తిని బలోపేతం చేస్తూ, శక్తివంతమైన ఆరోగ్యవంతమైన,నైతికమైన, నైపుణ్య వంతమైన యువతగా విద్యార్థులను తీర్చిదిద్దే గురుతర బాధ్యత ఉపాధ్యాయులు తీసుకోవాలని అధ్యాపకులకు తెలిపారు. స్థిరమైన అభివృద్ధి కోసం యువత డిజిటల్ మార్గాలు ఎంచుకోవాలని అన్నారు. కృత్రిమ మేధ గురించి వివరించారు.యువశక్తి జాతీయ శక్తి అని తెలిపారు. అనంతరం ముఖ్య అతిథిని డాక్టర్ నాయుడు సత్కరించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ బృందాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి అభినందించారు. వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఇన్చార్జి మూర్తి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు టి తేజేశ్వరరావు, ఐ గౌరీ ప్రియ, ఐ ఆర్ సి ఎస్ ఫీల్డ్ ఆఫీసర్ ఎస్ మల్లేశ్వరరావు అధ్యాపకులు, మరియు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## రెవెన్యూ సదస్సులను విధిగా నిర్వహించాలి

**అంబాజీపేట, మేజర్ న్యూస్ :** గ్రామాల్లో నిర్వహించే రెవెన్యూ సదస్సులను విధిగా నిర్వహించాలని ఎవరూ అలసత్వం వహించవద్దని తహసీల్దార్ జె. వెంకటేశ్వరి అన్నారు. అంబాజీపేట తహసీల్దార్ కార్యాలకంలో వీఆర్వోలకు, సర్వేయర్ లకు సదస్సులపై సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సదస్సుల్లో భూ సమస్యలతోపాటు గ్రామంలో రెవెన్యూ సమస్యలపై దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 16న పసుపల్లి. 20న ముక్కామల, 22న వక్కలంక, 24న ఇరుసుమండ, 27న పుల్లేటికుర్రు, 29న కె.పెదపూడి, 31న మాచవరం, వచ్చే నెల 03న ఇసుకపూడి, 05న చిరతపపూడి. 10న గంగలకుర్రు, 12న గంగలకుర్రు అగ్రహారం, 17న నందంపూడి, 19న తొండవరం, 21న వాకలగరువు, 24న మొసలపల్లి గ్రామాల్లో ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద నిర్వహించనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. సమావేశంలో డీటీ పి.పద్మలక్ష్మి, ఆర్ఐ ఎం.డీ. ఇబ్రహీం, వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

## సూర్యారావు కుటుంబానికి ఆర్ధిక సాయం



**అంబాజీపేట, మేజర్ న్యూస్ :** ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పుల్లేటికుర్రుకు చెందిన ఎంఆర్పీఎస్ సీనియర్ నాయకులు, ఉత్తరాంధ్ర జిల్లాల బీజేపీ ఎస్సీ మోర్చ జోనల్ ఇన్చార్జి కొల్లి సూర్యారావు కుటుంబానికి సోమవారం ఆర్థిక సాయాన్ని పార్టీ నాయకులు పంపిణీ చేశారు. డాక్టర్ బీఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా బీజేపీ అధ్యక్షులు యాళ్ల వెంకట రామ్మోహనరావు (దొరబాబు) రూ.10వేల ఆర్థిక సాయాన్ని సూర్యారావు కుటుంబానికి అందించారు. కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కముపు శ్రీను, గుత్తుల సత్యనారాయణ, నూకపెయ్యి చిన్న, జంగా పల్లేశ్వరరావు, లక్కింశెట్టి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

**వాకర్స్ సేదతీరేందుకు 4 సిమ్మెంట్ బల్లలు స్పాన్సర్ చేసిన జిఎస్ ఫౌండేషన్ అధినేత**



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** జిఎస్ ఫౌండేషన్ అధినేత గుత్తుల శ్రీనివాస్ సోమవారం వలసపాకల గ్రామ పంచాయతీ కాకినాడ పబ్లిక్ స్కూల్ ప్రక్కన ఉన్న పార్క్‌లో వాకర్స్ కి సేద తీరుటకు 4 సిమెంట్ బల్లలు స్పాన్సర్ చేసారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ మాజీ ఉప సర్పంచ్, జనసేన నాయకులు సలాది శ్రీనివాస్ బాబు, గౌతమ్, రామ్సు, ఈగల వీరబాబు, అల్లు అప్పారావు, వలసపాకల గ్రామ కమిటీ వైస్ ప్రెసిడెంట్ పండు నాయుడు, లోవరాజు, దుర్గ ప్రసాద్, కృష్ణ హరికృష్ణ మరియు గ్రామ పెద్దలు మేడిశెట్టి వెంకటరమణ, కొల్లుబోయిన సూరిబాబు, సానా నాగబాబు, గుత్తుల శ్రీనివాస్ ని అభినంధించారు.

## శాఖా గ్రంధాలయం ఆధ్వర్యంలో తిరంగా యాత్ర

**పెద్దాపురం,మేజర్‌న్యూస్ :**పెద్దాపురం ప్రధమశ్రేణి శాఖా గ్రంధాలయంలో ఆజాదీకా అమృత్ మహోత్సవ్ వేడుకలో భాగంగా మువ్వన్నెల జెండా జైహింద్ అంటూ ర్యాలీగా ఇంటింటికి తిరిగి తిరంగా యాత్ర నిర్వహించారు.ఈకార్యక్రమంలో గ్రంధాలయాధికారి పాలంకినాగరాజు,సింగం బుల్లియ్య, ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి, విద్యార్థులు, పాఠకులు, తదితరులు పాల్గొన్నారు.



## ఫ్యాప్టో బహిష్కరణ

ఆత్రేయపురం, మేజర్ న్యూస్ : అసంబద్ధముగ వున్న ఉపాధ్యాయుల పని ఫ్యాప్టో సర్దుబాటు ప్రక్రియను సోమవారం ఉపాధ్యాయులు బహిష్కరించారు. ఉపాధ్యాయ సంఘాలుగా చెప్పినటువంటి ఏ అంశాన్ని పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్షంగా రాష్ట్ర విద్యాశాఖ ఈ ప్రక్రియను అత్యవసరంగా చేపడుతుంది దీన్ని నిరసిస్తూ రాష్ట్ర ఫ్యాప్టో పిలుపు మేరకు సోమవారం ఆత్రేయపురం మండలంలో ఫ్యాప్టోగా బహిష్కరిస్తున్నట్టు మండల విద్యాశాఖ అధికారికి మెమొరాండం అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నాయకులు టి.రామకృష్ణ, సి.హెచ్. సుధాకర బాబు, జి.మాణిక్యాలరావు, ఎం.దొరబాబు, వై.వెంకట్రాజు, ఎస్.వి.వి.ఎన్. ఎస్. ప్రసాద్, టి.శ్యామ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## తోలుబొమ్మలాట కళాకారులను సత్కరించిన జిల్లా కలెక్టర్ షణ్మోహన్





కాకినాడ, మేజర్ న్యూస్ : ప్రాచీన కాలం నుంచి అత్యంత ప్రజాదరణ పొంది, ప్రస్తుతం అంతరించిపోతున్న తోలుబొమ్మలాటను ప్రజలకు అందుబాటులో ఉంచాలనే సదుద్దేశంతో ప్రభుత్వం ద్వారా తోలుబొమ్మలాటపై విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాటు ఉచితంగా శిక్షణ ఇస్తున్న కాకినాడ రూరల్ జమునగర్‌కి చెందిన తోట బాలకృష్ణ చేస్తున్న కృషిని గుర్తించి, ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ శాంతిమండలి (యునైటెడ్ నేషన్స్ ఇంటర్నేషనల్ పీస్ కౌన్సిల్) పాండిచ్చేరిలో ఇటీవల కళారత్న అవార్డ్ ప్రధానం చేసింది. ఈ నేపథ్యంలో సోమవారం కాకినాడ కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ షణ్మోహన్..తోట బాలకృష్ణ దంపతులను సత్కరించారు. తోలు బొమ్మలాట కళలో అత్యంత ప్రావీణ్యం సంపాదించారని ఈ సందర్భంగా ఐక్యరాజ్యసమితి ప్రధాన చేసిన సర్టిఫికేట్, షీల్డ్‌ను జిల్లా కలెక్టర్.. బాలకృష్ణ దంపతులకు అందజేసి ప్రత్యేకంగా అభినందించారు.

# జిల్లాస్థాయి పిజీఆర్ఎస్ 187 అర్జీలు

- ఆగస్ట్ వేడుకల్లో శకటాల ప్రదర్శన, స్టాల్స్ ఏర్పాటు చేపట్టాలి
- కోర్టు పరిధిలోని పెండింగ్ కేసులపై సమాధానం సకాలంలో సమర్పించాలి
- కలెక్టర్ పి.ప్రశాంతి

రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ : ప్రజా సమస్యల ఫిర్యాదుల పరిష్కారం దిశగా క్షేత్ర స్థాయి అధికారుల ద్వారా పరిష్కారం చేపట్టాల్సిన అర్జీలు కలెక్టరేట్ కు రావడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజల నుంచి కలెక్టర్, ఇంచార్జ్ జెసి జి నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు , ఇతర అధికారులు అర్జీలు స్వీకరించడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ పి ప్రశాంతి మాట్లాడుతూ, జిల్లా స్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా 187 అర్జీలను స్వీకరించడం జరిగిందన్నారు. వాటిలో రెవిన్యూ 71 , పోలీసు 30, పౌర సరఫరాలు 26, పంచాయితీ రాజ్ 25, ఇతర శాఖలు 35 అర్జీలు



స్వీకరించామన్నారు. డివిజన్ మండల స్థాయిలో పరిష్కారం అయ్యే అర్జీలు కలెక్టరేట్‌కు రావడం జరుగుతోందని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడం సాధ్యం అవుతుందని ప్రజల్లో నమ్మకం పెంచేలా అధికారుల పనితీరు ఉండాలన్నారు. ఈ సందర్భంగా డివిజన్, పలు మండలాల నుంచి వచ్చిన అర్జిల సమస్య లపై జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ అక్కడికక్కడే ఆయా డివిజన్ , మండల అధికారులతో కలక్టర్ మాట్లాడి సమస్య పై చర్చించడం జరిగింది. వివిధ శాఖల తరపున కోర్టు కేసుల విషయం లో ప్రస్తుతం ఉన్న అధికారి వ్యక్తిగత శ్రద్ధ తీసుకొని, చర్యలు తీసుకోవడం తప్పనిసరి అని తెలిపారు.

ఈ విషయములో ఎటువంటి నిర్లిప్తత వహించినా ఉపేక్షించడం జరగదని పేర్కొన్నారు. కోర్టు పరిధిలోని పెండింగ్ కేసుల పై సమాధానం సకాలంలో సమర్పించాలనీ ఆదేశించారు. శ్రీ మధర్ థెరిస్సా దివ్యాంగుల సేవా సంఘం తరపున ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, సహాయ సంచాలకులు కార్యాలయం ఏర్పాటు, 300 యూనిట్స్ వరకూ ఉచిత విద్యుత్, హెల్త్ కార్డులు, బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీకి కోసం అర్జీ అందచేశారు. కలెక్టర్ స్వయంగా కిందకు దిగి వచ్చి వారి సమస్యలను తెలుసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయా జిల్లా అధికారులు, అనుబంధ సిబ్బంది పాల్గొన్నారు.

## 'మీకు తెలుసా' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి



కాకినాడ, మేజర్ న్యూస్ : హెచ్ఐవి, ఎయిడ్స్ పట్ల ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ(ఎన్ఏసీవో) నేతృత్వంలో రెండు నెలలు పాటు నిర్వహించే "మీకు తెలుసా" కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కాకినాడ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్..వివిధ శాఖల అధికారుల సమక్షంలో హెచ్ఐవి, ఎయిడ్స్‌పై రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్ఐవి, ఎయిడ్స్ నియంత్రణ, ప్రజల్లో అవగాహన కల్పించే నిమిత్తం ఎనిమిది వారాలపాటు (రెండు నెలల) 8 రకాల అంశాలపై వివిధ అవగాహన కార్యక్రమాలను జిల్లాలో ఉన్న అధికారులతో పాటు స్వచ్ఛంద సంస్థలతో కలిసి నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్రస్థా యిలో ఈనెల నేటి నుంచి చేపట్టిన మీకు తెలుసా కార్యక్రమాన్ని జిల్లాలో కూడా విజయవంతంగా నిర్వహించాలన్నారు. హెచ్ఐవీ, ఎయిడ్స్, సుఖ వ్యాధులు పట్ల ప్రజలకు విస్తృత అవగాహన కల్పించడంతో ఎక్కువమంది హెచ్ఐవి రక్త పరీక్షలు చేసుకునేలా ముందుకు రావడం జరుగుతుందన్నారు. హెచ్ఐవీ బాధితుల పట్ల ఉన్న చిన్న చూపు, వివక్షతను హెచ్ఐవీ, ఎయిడ్స్ చట్టం - 2017, టోల్ ఫ్రీ నెంబర్ 1097 మొదలైన వాటిపై అవగాహన కల్పించడం ద్వారా ద్వారా వారిని వివక్షత బారి నుంచి కాపాడి వారి జీవిత కాలాన్ని పొడిగించడానికి కృషి చేయవచ్చన్నారు. ఈ ప్రచార కార్యక్రమాలు వైద్య ఆరోగ్యం అనుబంధ శాఖల సహకారంతో గ్రామీణ, అర్బన్ ప్రాంతాల్లో, కళాశాలల్లో అవగాహన సదస్సులు, ర్యాలీలు, వైద్య శిబిరాలు వంటి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ వివరించారు. కార్యక్రమంలో జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి డా.ఆర్. రమేష్, డీసీహెచ్ఎస్ ఎన్.స్వప్న, క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ శైలజ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## నిరుపేదలకు కేవలం ఐదు రూపాయలకే కడుపు నిండా భోజనం పెట్టడమే అన్న క్యాంటీన్‌ల లక్ష్యం

- ఎమ్మెల్యే వనమాడి కొండబాబు





కాకినాడ, మేజర్ న్యూస్ : అన్నా క్యాంటీన్లను ఆగస్టు 15 నుంచి ప్రారంభించేందుకు తగు ఏర్పాట్లు చేస్తున్నట్లు కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. సోమవారం కాకినాడ అన్నంఘాటి సెంటర్ నందు ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను కార్పొరేషన్‌అధికారులతోకలిసి ఎమ్మెల్యే కొండబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ పేదవారి ఆకలిని తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 15వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా 100 అన్నా క్యాంటీన్‌లను ప్రారంభిం చడం జరుగుతుందని, రాష్ట్రంలో నూతన ప్రభుత్వ ఏర్పడగానే రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేసే సమయంలో అన్నా క్యాంటీన్లు పునరుద్ధరిస్తామని ప్రకటించారని అందులో భాగంగా అన్నా క్యాంటీన్ల ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఆకలితో అలమటిస్తున్న నిరుపేదలకు కేవలం ఐదు రూపాయలకే కడుపునిండా అన్నం పెట్టేందుకు కాకినాడ నగరంలో ఐదు అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో జగన్మోహన్ రెడ్డి రాజకీయ కక్షతో అన్నా క్యాంటీన్లు మూసి వేయడం జరిగిందని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే అన్న క్యాంటీన్ లను పునర్దించడం జరుగుతుందని, స్వాతంత్ర దినోత్సవం నుంచి ఐదు రూపాయలకే భోజనం అందించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ అధికారులు మరియు తెలుగుదేశం నాయకులు మల్లిపూడి వీరు, పాలిక నాని, గెడ్డం పూర్ణ చంద్రశేఖర్, మేడిశెట్టి చిన్ని, పెదపూడి కుమార్, పీర్ల లక్ష్మి ప్రసన్న, సంఘాని నాగూర్, జనసేన నాయకులు మరియా, శివ తదితరులు పాల్గొన్నారు.



## ఐటీడీఏ గ్రీవెన్స్‌లో వినతులు స్వీకారం

రంపచోడవరం, మేజర్‌న్యూస్ : సోమవారం స్థానిక ఐటిడిఎ సమావేశం హాలులో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులతో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం, ఐటీడిఎ ఏపీఓ జనరల్ సి.హెచ్. శ్రీనివాసరావు నిర్వహించారు. ఈ సందర్భంగా రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్ట. సింహాచలం మాట్లాడుతూ ఈవారం 47 దరఖాస్తులు రావడం జరిగిందని ఆయన తెలిపారు. మారేడుమిల్లి గ్రామంలోని పోలీస్ స్టేషన్ సెంటర్ నుండి ఎపిఆర్ స్కూల్ వరకు రోడ్డు ఇరుకుగా ఉండటం వలన ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని రోడ్డు వెడల్పు చేయాలని దూడ బ్రహ్మాజీరావు, గొర్లె సువర్ణ రాజు, కంభం విజయకుమార్ దరఖాస్తు సమర్పించారు, పోలవరం ప్రాజెక్ట్ ముంపు గ్రామాలైన కతనపల్లి, పెద్దగూడెం, సోమర్లపాడు, కొక్కిరి గూడెం గ్రామాల ముంపు బాధితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అమలు చేయాలని, నేల దోనెలపాడు ఆర్ అండ్ ఆర్ కాలనీలో వీధిలైట్లు ఏర్పాటు చేయాలని, ఈ కాలనీలో అంగనవాడి పిల్లలు ఎక్కువ ఉండటం వలన రెండవ అంగన్వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని అదేవిధంగా అంగన్వాడి టీచర్‌ని కూడా ఏర్పాటు చేయాలని, కొండ మొదలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి నియమించాలని, కొన్ని స్కూళ్లకు పక్క స్కూల్ భవనాలు ఏర్పాటు చేయాలని కొండ మొదలు సర్పంచ్ వేట్ల విజయ, వంజం జోగారావు, సత్యనారాయణ దరఖాస్తు సమర్పించారు, దేవీపట్నం మండలంలోని పాము గండి గ్రామంలో కమ్యూనిటీ భవనం ఏర్పాటు చేయాలని కోసు లచ్చన్న దొర, కోసు సూర్యనారాయణ దరఖాస్తు సమర్పించారు, ఈకార్యక్రమంలో ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే కె. దేవేంద్రుడు, డిప్యూటీ సర్వే ఆఫ్ ఇన్స్పెక్టర్ బాబురావు, తాసిల్దార్ కృష్ణ జ్యోతి, ఏడియం & హెచ్ఓ జి.శిరీష, వెలుగు ఏపిడి ఎ.శ్రీనివాస రావు, డాక్టర్ ఇందిరా, డియల్ డిఓ కె.కోటేశ్వరరావు, జి. డేవిడ్ రాజ్, ఎండి. యూసఫ్, రవికుమార్, ఏఎంఓ. సి.శ్రీహరి, డిప్యూటీ తాసిల్దార్ శ్రీధర్, స్వామి, రవీంద్రబాబు, త్రిమూర్తులు, ఉపాధి హామీ పథకం ఎపిడి జి.శ్రీనివాసరావు, పిహెచ్ఓ చిట్టి బాబు, ఏడిఏ సి.హెచ్.కె.వి. చౌదరి, సావిత్రి, సిడిపిఓ సంధ్యారాణి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు మల్లికార్జున, సాయి సతీష్, రాజేంద్ర బాబు, రామచంద్ర మూర్తి, జిసిసి మేనేజర్ రాజారెడ్డి, పశుసంవర్ధక శాఖ ఏడి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## జీవవైవిధ్య పరిరక్షణతో మానవ మనుగడ సాధ్యం





కాకినాడ,మేజర్‌న్యూస్ : జీవవైవిధ్య పరిరక్షణతో మానవ మనుగడ సాధ్యమని జోవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ కె.వి.ఎస్.జె మురళీకృష్ణ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జీవవైవిధ్య మండలి మరయు పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో స్థానిక జేఎన్టీయూ సెనేట్ హాల్, జే.ఎన్.టి.యు, కాకినాడ నందు ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న విద్యార్థులకు వక్తృత్వం, డిబేట్ మరియు లఘు చిత్రాల పోటీలను సోమవారం నిర్వహించడం జరిగింది. ఈ పోటీలకు జిల్లాలోని వివిధ మండలాల నుంచి 208 మంది విద్యార్థులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జోహార్ లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సర్ డాక్టర్ కె.వి.ఎస్.జి మురళీకృష్ణ మాట్లాడుతూ జీవవైవిధ్య పరిరక్షణతోనే మానవాళి మనుగడకూడా సాధ్యమని అన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. మొక్కలు నాటడం జీవితంలో ఒక భాగంగా చేసుకోవాలన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జీవ రాష్ట్ర జీవవైవిధ్య మండలి ప్రాంతీయ సమన్వయకర్త సత్య ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులకు జీవవైవిధ్యం పట్ల అవగాహన కల్పించడానికి ఇటువంటి పోటీలు సహకరిస్తాయని అన్నారు. జిల్లా సైన్స్ అధికారి ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి జీవవైవిధ్యం మరియు పర్యావరణ పరిరక్షణ పట్ల అవగాహన కల్పించవలసిన బాధ్యత ప్రతి ఒక్కరి పైనా ఉందని అన్నారు. జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా సమన్వయకర్త కేసరి శ్రీనివాస్ రావు మాట్లాడుతూ పిల్లలకు చక్కటి అవకాశాన్ని కల్పించిన జీవవైవిధ్య మండలి మరియు పాఠశాల విద్యాశాఖకు ధన్యవాదాలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ నేషనల్ గ్రీన్ కోర్ జిల్లా సమన్వయకర్త కె.వి.కె. మహేశ్వరరావు, క్లస్టర్ కోఆర్డినేటర్లు కె.కిరణ్ కుమారి, ఎన్.వీరభద్రరావు, కె.వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

## పాత్రికేయులకు అండగా కూటమి ప్రభుత్వం..

- ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ



అంబాజీపేట, మేజర్ న్యూస్ : పాత్రికేయులకు అండగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పని చేస్తుందని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. ది అంబాజీపేట జర్నలిస్ట్ అసోసియేషన్ (తాజా)కు నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణను పి. గన్నవరంలోని జనసేన పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా సోమవారం కలిశారు. సందర్భంగా అధ్యక్షులు పళ్ళ సూర్య ప్రకాశరావు (బాబ్జి) ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు.

తాజా క్లబ్ గౌరవాధ్యక్షులు మద్దింశెట్టి శ్రీనివాస్, అధ్యక్షులు పళ్ళ బాబ్జి, కోశాధికారి ఐ.ప్రపుల్ కుమార్, ఉపాధ్యక్షులు కోన సత్తిబాబు, జల్లి విక్టర్ కుమార్, గుత్తుల ఏడుకొండలు, సహాయ కార్యదర్శి దంగేటి సోమేశ్, సభ్యులు గోసంగి శ్రీనివాస్, తాజా మాజీ అధ్యక్షులు మట్టపర్తి శ్రీనివాస్‌లను ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ సన్మానించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు శిరిగినీడి వెంకటేశ్వరరావు,వాసంశెట్టి కుమార్, సాధనాల శ్రీ వెంకటేశ్వరరావు, మైపాల తాతాజీ, ఏడిద నాగబాబు, తాటికాయల శ్రీను, నేదునూరి వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

## కాకినాడ స్మార్ట్ సిటీ అభివృద్ధికి నూతన ప్రగతికి ప్రణాళికలు

- కార్పొరేషన్ సొమ్ములను దోచుకున్న ద్వారంపూడిపై విచారణ
- ఎమ్మెల్యే వనమాడి కొండబాబు



కాకినాడ, మేజర్ న్యూస్ : కాకినాడ స్మార్ట్ సిటీ అభివృద్ధికి నూతన ప్రగతి ప్రణాళిక రూపొందించి, గత వైసిపి ప్రభుత్వ హయాంలో కార్పొరేషన్ తుమ్ములను దోచుకున్న ద్వారం పూడిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవడం జరుగుతుందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో మిన్సిపల్ కమీషనర్ భావన ను కలిసి గత ప్రభుత్వ హయాంలో 2019 నుండి 2024 వరకు మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మున్సిపల్ కార్పొరేషన్‌ను ఏ విధంగా లూఠీ చేశారో అన్ని అంశాలను ఆధారాలతో సహా అందజేసి విచారణ చేపట్టాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే కొండబాబు మీడియాతో మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన తరువాత మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి ఒక్క రూపాయి నిధులు తీసుకురాకుండా కేవలం ప్రజలు కట్టిన పన్నులు వందల కోట్ల రూపాయిలు దోచేసాడని, కాకినాడ అభివృద్ధి గత తెలుగుదేశం ప్రభుత్వ అధికారంలోనే అన్ని విధాలా అభివృద్ధి చేయడం జరిగిందని, మాజీ ఎమ్మెల్యే తన పదవీకాలం అంతా అధికారం అడ్డు పెట్టుకుని గతంలో చేసిన ప్రగతి పనులకు తిరిగి బిల్లులు చేయించుకుని కోట్ల రూపాయిలు తన స్వంత ఖాజానాకు తరలించుకుపోయాడని పేర్కొన్నారు. ప్రజలు కట్టే పన్నులు సొమ్ములను దుబారా చేయకుండా కేవలం కాకినాడ నగర అభివృద్ధికి వెచ్చించడం జరుగుతుందని, ప్రధానంగా డ్రైన్లు నిర్వహణ, పారిశుధ్య పర్యవేక్షణ, విద్య, వైద్యం, విద్యుత్ అంశాలపై దృష్టి సారించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని తెలిపారు. తన హయాములో కాకినాడ అభివృద్ధి ఎలా ఉండాలి అని ప్రజలు భావిస్తున్నారో అవిధంగా అభివృద్ధి ప్రజలకు అందించే విధంగా నూతన కార్యాచరణ రూపొందిస్తున్నట్లి సిటీ ఎమ్మెల్యే కొండబాబు తెలిపారు.ఆయన వెంట తెదేపా నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు, తుమ్మల రమేష్, ఒమ్మి బాలాజీ, గుమ్మల్ల చిన్నా తదితరులు ఉన్నారు.

## ఘనంగా జాతీయ గ్రంథపాలకుల దినోత్సవం



కాకినాడ,మేజర్‌న్యూస్ : జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలోని కాకినాడ గాంధీనగర్ శాఖా గ్రంథాలయంలో సోమవారం గ్రంథాలయ శాస్త్ర పితామహ డాక్టర్ ఎస్.ఆర్. రంగనాథన్ జయంతి, జాతీయ గ్రంథపాలకుల దినోత్సవం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మహిళా శిశు సంక్షేమ శాఖ రిటైర్డ్ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ సిహెచ్ కామేశ్వరమ్మ విచ్చేసి డాక్టర్ ఎస్.ఆర్.రంగనాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు వై.ఎస్. మూర్తి గ్రంథాలయ పాఠకులకు కావలసిన పుస్తకాలను అందుబాటులో ఉంచినందుకు నిర్వాహకులను అభినందించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ ములంపాక శ్రీనివాసరావు మాట్లాడుతూ డాక్టర్ ఎస్.ఆర్.రంగనాథన్ రూపొందించిన గ్రంథాలయ పంచ సూత్రాలు ఆధారంగా పాఠకులకు సమయం వృధా కాకుండా సేవలు అందించుటకు వీలుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్.ఒ.సి. నెం: 2981/97-98-ఎ2, **పెద్దాపురం పురపాలక సంఘం** ది. 07.08.2024

**బహిరంగ వేలము నోటీసు**

పెద్దాపురం పురపాలక సంఘ ఆధీనములో గల ఈ దిగువ తెలిపిన షాపురూములను 3 సంవత్సరాల కాలమునకు ప్రస్తుతం అమలులో ఉన్న ప్రభుత్వ ఉత్తర్వులు నెం. 56 ఎంఎ & యుడి, ది. 05.02.2011 ప్రకారం షాపురూములను లీజు పద్ధతిపై అద్దెకు ఇచ్చుటకుగాను ది.21.08.2024వ తేదీ బుధవారం ఉదయం గం.11.00 ల నుండిపెద్దాపురం పురపాలక సంఘ కార్యాలయము నందు బహిరంగ వేలం నిర్వహించబడును. ఎస్.సి., ఎస్.టి. కేటగిరిలకు రిజర్వ్ చేసిన షాపులకు కులధృవీకరణ పత్రము దాఖలు చేయవలెను.

| వ.నెం. | షాపింగ్ కాంప్లెక్స్ పేరు | షాప్ నెం. | కేటగిరి | బహిరంగ వేలం/ టెండర్ కమ్ ఆక్షన్ | టెండర్ షెడ్యూల్ రుసుము చెల్లించు తేదీ | టెండర్ షెడ్యూల్ జారీ చేయు తేదీ | ధరావత్తు & సాల్వెన్సీ రూ. |
|---|---|---|---|---|---|---|---|
| 1. | జనతా షాపింగ్ కాంప్లెక్స్ | ఎ10, డి8, ఎఫ్1, జి2, జి4, జి6, హెచ్1, హెచ్3, హెచ్4, ఐ4, ఐ5 | జనరల్ కేటగిరి | బహిరంగ వేలం | - | - | 3,500/- 10,000/- |
| 2. | మరిడమ్మ మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ | షాపు నెం. 2 | ఎస్.సి.కేటగిరి (2వ పిలుపు) | బహిరంగ వేలం | - | - | 6,000/- 50,000/- |
| 3. | వై.ఎస్.ఆర్. మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ (ఖాళీగా ఉన్న అన్ని షాపులు) | మొదటి అంతస్తు షాపు నెం.27, 29 | జనరల్ కేటగిరి (1వ పిలుపు) | బహిరంగ వేలం | - | - | 10,000/- 25,000/- |
| | | మొదటి అంతస్తు షాపు నెం.28 | జనరల్ కేటగిరి (3వ పిలుపు) | బహిరంగ వేలం | - | - | 10,000/- 25,000/- |
| | | మొదటి అంతస్తు షాపు నెం.20, 21 | జనరల్ కేటగిరి (7వ పిలుపు) | టెండర్ కమ్ / ఓపెన్ ఆక్షన్ | రూ.100/-లు 17.08.2024 నుండి 20.08.2024 మధ్యాహ్నం 12.00ల వరకు | 20.08.2024 మధ్యాహ్నం 3.00 గం.లకు | 10,000/- 25,000/- |
| 4. | ఓల్డ్ ఎ.పి.ఎస్.ఆర్.టి.సి. కాంప్లెక్స్ | 1) షాపు నెం.7 2) షాపు నెం.8 | 1) ఎస్.సి.కేటగిరి 2) ఎస్.టి.కేటగిరి (7వ పిలుపు) | | | | 3,000/- 10,000/- |
| 5. | శివాలయం మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ | 10 మరియు 12 | జనరల్ కేటగిరి (7వ పిలుపు) | | | | 10,000/- 25,000/- |

షరతులు :

1. బహిరంగ వేలం నందు పాల్గొను పాటదారులు ధరావత్తు, సాల్వెన్సీ, సాల్వెన్సీకి చెందిన ఇ.సి మరియు దస్తావేజు నకళ్ళు మొదలగు అన్ని నిబంధనలు వేలం ప్రారంభించుటకు గంట ముందుగా కార్యాలయమువారికి సమర్పించి పాటలో పాల్గొనవలెను. తనఖాలో ఉన్న ఆస్తులకు సంబంధించిన సాల్వెన్సీలు అనుమతించబడవు.
2. టెండర్ కమ్ / ఓపెన్ ఆక్షన్ నందు పాల్గొను పాటదారులు ధరావత్తు, సాల్వెన్సీ, సాల్వెన్సీకి చెందిన ఇ.సి. మరియు దస్తావేజు నకళ్ళు మొదలగునవి సీల్డ్ టెండర్లు 21.08.2024 మధ్యాహ్నం గం.3.00 గంటలలోపు దాఖలైన టెండర్లను టెండరుదారుల సమక్షములో తెరిచి వెంటనే వాటికి బహిరంగ వేలం నిర్వహించబడును.
3. ఇతర వివరముల కొరకు కార్యాలయము పనిచేయు వేళలలో ఎ2 గుమస్తా వారిని సంప్రదించవలెను.
4. ఏదైనా కారణముగా చేత పాటను వాయిదా/రద్దు పరచే పూర్తి అధికారము కమిషనర్ వారికి కలదు.

కమిషనర్
పెద్దాపురం పురపాలక సంఘం

## జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా "మెగా జాబ్ మేళా" బ్రోచరు ఆవిష్కరణ



**కాకినాడ, మేజర్ న్యూస్ :** సోమవారం కలెక్టర్ చాంబర్‌లో "వికాస" ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీ శనివారం పిఠాపురంలో జరిగే "మెగా జాబ్ మేళా" బ్రోచరును కలెక్టర్ సగిలి షాన్ మోహన్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వికాస ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.లచ్చారావు మాట్లాడుతూ. ఈ జాబ్‌మేళా ద్వారా సుమారు 36 కంపెనీలతో 2500 ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నామన్నారు. జాబేళాలో పాల్గొనే కంపెనీల వివరాలతో ఉన్న బ్రోచర్ను, బులిటెన్ను కలెక్టర్‌కి వివరించారు. ఈ కార్యక్రమంలో డి.ఆర్.ఒ. తిప్పే నాయక్, డీఆర్డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీరమణి, డి.ఎస్.డి.ఒ. హరిశేషు తదితరులు పాల్గొన్నారు.

## కొబ్బరి చెట్టును ఢీకొట్టిన కారు



**అంబాజీపేట, మేజర్ న్యూస్ :** శుభకార్యానికి వెళ్లి వస్తున్న ఓ కారు అదుపుతప్పి నందంపూడి వంతెన సమీపంలో ప్రధాన రహదారి పక్కనే ఉన్న కొబ్బరి చెట్టును బలంగా ఢీకొట్టారు. వివరాలు ఇలా ఉన్నాయి. గూడాల గ్రామానికి చెందిన ముగ్గురు మహిళలు, ముగ్గురు పురుషులు, ఒక చిన్నారి శాంత్రో కారులో పి.గన్నవరం మండలం గంటి శుభకార్యానికి వెళ్లారు. శుభకారం చూసుకొని గూడలకు తిరిగి వెళుతున్న సమయంలో నందంపూడి వంతెన సమీపంలో కారు అదుపుతప్పడంతో కొబ్బరి చెట్టును బలంగా ఢీకొట్టారు. దాంతో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులకు, ముగ్గురు మహిళలకు, చిన్నారికి తీవ్ర గాయాలు అయ్యాయన్నారు. క్షతగాత్రులు అమలాపురంలోని ప్రైవేట్ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం వెళ్లినట్లు స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో గాయపడిన వారి వివరాలు తెలియాల్సి ఉంది.

# డ్వాక్రా సంఘాల ద్వారా కట్టిన సొమ్మును గుత్తేదారులకి ఇప్పించాలి

**– కమిషనర్‌కు కొమరగిరి గుత్తేదారుల విన్నపం**

**కాకినాడ,మేజర్‌న్యూస్ :** డ్వాక్రా సంఘాల ద్వారా కట్టిన సొమ్మును గుత్తేదారులకి ఇప్పించాలని కోరుతూకొమరగిరి గుత్తేదారులు కమిషనర్ భావనకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కాకినాడ అర్బన్ నియోజకవర్గం ప్రజలకి గత ప్రభుత్వంలో నవరత్నాలు – పేదలందరికీ ఇల్లు పథకములో భాగముగా కొమరగిరి గ్రామం బీచ్ రోడ్ ఆనుకొని ఉన్న ప్రాంతములో 16,000 మందికి ఇల్లు పట్టాలిచ్చారని,మేమందరం కాకినాడ సబ్ డివిజన్ హౌసింగ్ అధికారులుపిలుపుమేరకు ఇల్లులు నిర్మించుటకు ముందుకు వచ్చామని, ఇళ్ళు కట్టేవారికి ట్యాగ్ చేయడం జరిగిందని, లబ్ధిదారులు నుండి అగ్రిమెంట్ చేసుకున్న తర్వాత వాళ్ళు ఒప్పందంతో మాకు బిల్డింగ్ నిర్మాణం చేయుటకు ఐరన్ మరియు సిమెంట్ ఇచ్చి వాళ్ళు కట్టిన డ్వాక్రా సొమ్ము రూ.20,000 నుండి 35,000లు వరకు అడ్వాన్స్ గా ఇచ్చేవారని, వాటితో లబ్ధిదారులు ఎన్నుకున్న 3.00,000 లక్షల రూపాయిలు ఇల్లు గాని మరియు 3.60,000 లక్షల రూపాయలు ఇల్లు గాని నిర్మించేవాళ్ళమని, హౌసింగ్ అధికారులు 3.60 లక్షల ఇల్లుకి మాత్రమే అడ్వాన్స్ పేమెంట్ ఇచ్చేవారని, 3.60 లక్షల ఇల్లుకి 9/9 కాలమ్స్ 9 స్తంబాలు వేసి ఐరన్‌తో కూడిన ప్లైన్ భీమ్ విత్ పైల్ క్యాప్‌తో సహా వేసి ప్లైన్ బీమ్ నుండి బేస్మెంట్ ఎత్తు 4 అడుగులు కట్టి ముందర భాగము వరండా (అరుగు) కట్టేవాళ్ళం, మిగతా ప్రాంతములో మనకిలాంటి హౌస్ డిజైన్ లేదు ఈ విధముగా అడ్వాన్స్ తీసుకుని బేసెమెంట్స్ కట్టేవారమన్నారు. రానురాను కొన్ని కారణాలవలన ముందు ఇచ్చిన అడ్వాన్స్ 35,000 ఆపి మరల మాకు అడ్వాన్స్ మెటీరియల్ ఇచ్చి మాచేత బేస్మెంట్లు కట్టించేవారని, అలా కట్టిన బేస్మెంట్లకి (ఎస్.హెచ్.జి.) సొమ్మును మాకు ఇచ్చారని, ఈ విధముగా బేస్మెంట్లు కట్టుకుంటూ పనులు ముందుకు తీసుకుని పోయినామన్నారు. ఈ మధ్య కాలంలో బేస్మెంట్లు కట్టినవాటికి నిమ్మిత్తం మా గుత్తేదారులకి చాలా వరకు డబ్బులు వస్తాయి కాబట్టి హౌసింగ్ అధికారులని ప్రెమెంట్స్ అడిగిన వారు ఎస్.హెచ్.జి. అమౌంట్ లబ్ధిదారులది గుత్తేదారులకి ఇవ్వడం నిలిపివేసినారు ప్రభుత్వం వారు బేస్మెంట్ లెవెల్ కి మెటీరియల్స్ తో కలుపుకుని రూ.50,000లు ఇస్తున్నది గతంలో అదే బేస్మెంట్ కి మెటీరియల్స్ తో కలిపి రూ.70,000లు ఇచ్చేవారని, ఎస్.హెచ్.జి.తో కూడిన ఇల్లుల నిర్మాణం కాబట్టి బేస్మెంట్ లెవెల్‌లోనే మాకు రూ.90,000 నుండి 1,00,000లు వరకు అవుతుందన్నారు. కావున మేము కట్టిన బేస్మెంట్లకి ఎస్.హెచ్.జి.సొమ్మును మాగుత్తేదారులకి ఇప్పించవల సిందిగా కోరుతున్నామన్నారు.



## నాన్ స్టాప్ బస్టాండ్ వద్ద పబ్లిక్ టాయిలెట్స్ మెరుగుపరచాలి

**– శ్రామిక మహిళా డిమాండ్**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆస్పత్రి ఎదుట నాన్‌స్టాప్ బస్టాండ్ వద్ద పబ్లిక్ టాయిలెట్స్ మెరుగుపరచాలని కోరుతూ ఈరోజు శ్రామిక మహిళా కన్వీనింగ్ కమిటీ జి.బేబీ రాణి, చంద్రమల్ల పద్మ ఆధ్వర్యంలో కాకినాడ మున్సిపల్ కమిషనర్ భావనకి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ బస్టాండ్ వద్ద అనేకమంది మహిళలు స్టూడెంట్స్, హాస్పిటల్ కి వచ్చే గర్భిణీ స్త్రీలు, పేషంట్స్ బస్సుల కోసం అక్కడ వేచి ఉంటారు. నిత్యము అక్కడ రద్దీగా ఉండే ప్రాంతం కూడా. కానీ అక్కడ పబ్లిక్ టాయిలెట్స్ లేక అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. అక్కడ బాత్రూం కట్టినా కనీస అవసరాలు లేక తీవ్ర ఇబ్బందికి గురవుతున్నారన్నారు. అంతేకాదు రాత్రి సమయంలో విద్యుత్ సౌకర్యం లేక అసాంఘిక కార్యకలాపాలు కూడా జరుగుతున్నాయి అన్నారు. ఈ సమస్యపై మున్సిపల్ కమిషనర్ భావన స్పందించి త్వరలో పరిష్కరిస్తామని తెలియజేశారు.

## ఎన్.చంద్రశేఖర్, సుబ్బనారాయణలకు సంఘానికి ఎటువంటి సంబంధం లేదు

**– నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం**

**కాకినాడ, మేజర్ న్యూస్ ప్రతినిధి :** ఆల్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నాలుగో తరగతి ప్రభుత్వ ఉద్యోగుల సంఘంకి రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులుగా చెప్పుకుంటున్న ఎన్.చంద్రశేఖర్, సుబ్బనారాయణలకు తమ సంఘానికి ఎటువంటి సంబంధం లేదని నాలుగవ తరగతి ఉద్యోగుల సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు సవరపు చిన్న పాపారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కండవల్లి చంద్రశేఖర్, నగర అధ్యక్షుడు ముక్కే రామకృష్ణలు తెలిపారు. ఈ సందర్భంగా వారు ఒక ప్రకటనను సోమవారం విడుదల చేశారు. 2022 నవంబర్ లో సంఘం నుంచి వారిని తప్పించారని అయినా వారు అధ్యక్ష, కార్యదర్శులు అంటూ చెప్పుకోవడం పట్ల తప్పు పట్టారు. వీరితో ఎటువంటి లావాదేవీలు జరపవద్దని, వారికి సంఘానికి ఎటువంటి సంబంధం లేదని అధ్యక్షుడు పాపారావు తెలిపారు. కాకినాడ నగరంలో ఉన్న సంఘ భవనంలో వచ్చిన అద్దెలను వారు దుర్వినియోగం చేస్తున్నందున వారిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. వారికి ఆ ఉద్యోగ సంఘంతో సంబంధం లేదన్నారు.

# సకాలంలో పరిష్కారం చూపాలి

**– "ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ", "డయల్ యువర్ కమిషనర్" నిర్వహించిన కమిషనర్ భావన**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా వచ్చిన ప్రతి ఒక్క సమస్యనూ సత్వరమే పరిష్కరించాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన ఆదేశించారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ఉదయం 9:30 నుంచి 10:30 వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని, అనంతరం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను కమిషనర్ నిర్వహించారు. డయల్ యువర్ కమిషనర్ ద్వారా ఇంజనీరింగ్, ప్రజారోగ్యం, టౌన్ ప్లానింగ్, యూపీఏ విభాగాలకు సంబంధించి 15 మంది ఫోన్ ద్వారా సమస్యలు విన్నవించారు. ఆయా సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కమిషనర్ భావన అక్కడే ఉన్న అధికారులను ఆదేశించారు. అనంతరం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో భాగంగా నరపాలక సంస్థ కార్యాలయంలో నేరుగా ప్రజల నుంచి కమిషనర్ వినతులు స్వీకరించారు. తన భూమిని వేరొకరు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఒకరు, రహదారుల ఆక్రమణ.. ఇలా వివిధ అంశాలపై 23 వినతులు కమిషనర్‌కు అందాయి. ప్రజలు ఇచ్చిన వినతులను స్వయంగా తీసుకొని వాటి పరిష్కారానికి ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి ఒక్క దరఖాస్తుకు నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలని స్పష్టం చేశారు. పరిష్కారమైన సమస్యలకు సంబంధించి సంబంధిత దరఖాస్తుదారునికి సమాచారం కూడా ఇవ్వాలన్నారు. ఆయా దరఖాస్తుల ప్రగతిపై ప్రతివారం సమీక్షిస్తామని కమిషనర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ సూపరింటెండెంట్ ఇంజినీర్ పి.సత్యకుమారి, స్మార్ట్ సిటీ ఎస్ఈ వెంకటరావు, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీ చరణ్, డీసీపీ హరిదాస్, మేనేజర్ కర్రి సత్యనారాయణ, ఉద్యాన సహాయ సంచాలకులు టి.వి. శిరిల్, పలువురు డీఈ లు, ఏఈలు, సూపరింటెండెంట్ లు పాల్గొన్నారు.

## ఈ- క్రాప్ బుకింగ్, సీసీఆర్సీ కార్డుల పంపిణీ ప్రక్రియ వేగవంతం చేయాలి



**కాకినాడ, మేజర్ న్యూస్ :** జిల్లాలో సాగు ఉత్పత్తిని పెంచడంతో పాటు ఈ- క్రాప్ బుకింగ్, సీసీఆర్సీ కార్డుల పంపిణీ ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో వ్యవసాయ అనుబంధ రంగాలకు సంబంధించిన క్షేత్రస్థాయిలో జరుగుతున్న కార్యకలాపాలపై జిల్లా కలెక్టర్ షణ్మోహన్.. వ్యవసాయం, పశుసంవర్ధక, ఉద్యానవన, మత్స్య, మైక్రో ఇరిగేషన్, లీడ్ బ్యాంక్ శాఖల అధికారులతో కలిసి అన్ని మండలాల తహశీల్దార్లు, వ్యవసాయ విస్తరణ అధికారులు ఇతర మండల స్థాయిలో అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. మండల స్థాయిలో సాగు ఉత్పత్తి పెంచడానికి చేపడుతున్న చర్యలు, ఇప్పటివరకు ఎంత మేర సాగు చేయబడింది, ఈ-క్రాప్ బుకింగ్, జిల్లా సాగు చేస్తున్న ఉద్యాన పంటల వివరాలు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్ సీజన్లో సాగు ఉత్పత్తి పెంచడానికి అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. ఇందుకు క్షేత్రస్థాయిలో వ్యవసాయ అధికారులు రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. అదేవిధంగా మండలాల వారీగా రైతులు ఏయే వరి రకాలు సాగు చేసుకున్నారో వివరాలు సిద్ధం చేయాలన్నారు. వస్తావా సాగుదారుడికి రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా ఈ- క్రాప్ బుకింగ్ సక్రమంగా నిర్వహించాలన్నారు. అదేవిధంగా కౌలు రైతులకు గుర్తింపు పత్రాల ప్రక్రియ వేగవంతం చేసి, రుణాలు మంజూరుపై దృష్టి పెట్టాలన్నారు. అర్హులైన కౌలు రైతులకు తప్పని సరిగా సీసీఆర్సీ కార్డు అందేలా రెవెన్యూ, వ్యవసాయ అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన తెలిపారు. ఉద్యాన, మైక్రో ఇరిగేషన్ పంటల సాగుపై రైతులు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి డా.డి.తిప్పే నాయక్, వ్యవసాయ శాఖ జేడీ ఎన్ విజయ్ కుమార్, మత్స్య శాఖాధికారి కె.కరుణాకర్, డ్వామా పీడీ ఎ వెంకటలక్ష్మి, జిల్లా ఉద్యాన అధికారి ఎం.మల్లికార్జునరావు, ఏపీఎంఐపీ పీడీ జీవీవీ.ప్రసాద్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

## గడువు ముగిసిన పదార్థాల వినియోగం

**– శ్రీ సూర్య రెస్టారెంట్‌పై కేసులు నమోదు**



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** విజిలెన్స్ ఎస్పీ కె.ఎస్.ఎస్.వి. సుబ్బారెడ్డి ఆదేశాల మేరకు విజిలెన్స్ అధికారులు, ఫుడ్ సేఫ్టీ అధికారులు మరియు లీగల్ మెట్రాలజీ అధికారులు సంయుక్తంగా రాజమహేంద్రవరం టౌన్, ఎవి అప్పారావు రోడ్డులో గల శ్రీ సూర్య రెస్టారెంట్ వెజ్, నాన్ వెజ్ హోటల్‌ను తనిఖీ చేసారు. ఈ సందర్భంగా క్యాండిడ్ పపయా టూటీ ఫ్రూటీ 1 కేజీ ప్యాక్ నందు మరియు 500గ్రాముల లూజు ప్యాక్ మొత్తం 1.5 కేజీల ప్యాక్‌పై వినియోగ కాలపరిమితి ముగిసి వుండటం గుర్తించి సదరు హోటల్ యజమానిపై జాయింట్ కలెక్టర్ కోర్టునందు ఎఫ్ఎస్–ఎస్ఎఐ–2006 సెక్షన్ 27(3) ప్రకారం కేసు నమోదు చేసారు. హోటల్ నందు వినియోగిస్తున్న వంట నూనె టిపిసి రీడింగ్ 25 కంటే అధికంగా ఉండి పర్మిషబుల్ లిమిట్స్ దాటిన కారణంగా హోటల్ యజమానిపై ఎఫ్ఎస్ఎస్ఎఐ రెగ్యులేషన్స్ 2.3.15(8) ప్రకారం జాయింట్ కలెక్టర్ కోర్టు నందు కేసు నమోదు చేశారు. హోటల్ తనిఖీకి విచ్చేసిన సమయంలో హోటల్‌లో తయారుచేసి రెడీగా ఉన్న చికెన్ ఫ్రై పీస్ బిర్యానీ నుండి శ్యాంపిల్‌ను నాణ్యతా పరీక్షల నిమిత్తం స్టేట్ ఫుడ్ ల్యాబ్, నాచారంకు పంపించారు.

ఈ తనిఖీలలో విజిలెన్స్ ఎస్సై టి.జగన్నాథరెడ్డి, ఎవో జె.భార్గవ మహేష్, తహశీల్దార్ కె.విజయ్ కుమార్, పిసి లు వీరబాబు, లోవరాజు, కిషోర్ కుమార్, శివకుమార్, ఫుడ్ సేఫ్టీ అధికారి వి.ఎ.ఎన్.ఎస్.ఎస్.వి. రుక్కయ్య, లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ సాల్మన్ రాజు, స్థానిక రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# అర్జీలను అత్యంత నాణ్యతతో పరిష్కరించాలి



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో అందిన అర్జీ లను అత్యంత నాణ్యతతో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. సోమవారం కాకినాడ కలెక్టరేట్ వివేకానంద హాలులో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ షణ్మోహన్..డీఆర్వో డా.డి.తిప్పేనారక్, జెడ్పీ సీఈవో ఎ.శ్రీరామ చంద్రమూర్తి, హౌసింగ్ పీడీ ఎన్వీవీ సత్యనారాయణ, డీఆర్డీఏ పీడీ కె.శ్రీరమణి, సీపీవో పీ.త్రినాథ్, డీఎల్డీవోలు పి.నారాయణ మూర్తిలతో కలిసి హాజరై, ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ వాటిపై త్వరితగతిన సమగ్రమైన, సంతృప్తికరమైన పరిష్కారాలు అందించాలని అధికారులను ఆదేశించారు. రెవిన్యూ, పింఛన్ల మంజూరు, టిడ్కో గృహాలు, ఇళ్ల స్థలాలు, భూమి వివరాలు ఆన్ లైన్లో నమోదు, ఆక్రమణలు తొలిగింపు, డ్రైన్, కాలువల్లో పూడిక తొలగింపు, పారిశుద్ధ్యం, సధరం సర్టిఫికేట్ మంజూరు ఉద్యోగ ఉపాధి అవకాశాలు వంటి అంశాలకు చెందిన 381 అర్జీలు అందాయి.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార నిమిత్తం ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందిన అర్జీలను గడువులోపు పరిష్కరించాలన్నారు. అర్జీదారుని సమస్యను క్షుణ్ణంగా పరిశీలించి తగిన పరిష్కారం చూపాలన్నారు. పరిష్కరించిన అర్జీల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ అర్జీల పరిష్కారాల ప్రగతిని ప్రతి శనివారం సమీక్షించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ విభాగాల అధిపతులు తదితరులు పాల్గొన్నారు.

## జెఎన్టీయుకె ప్రాంగణంలో 'తల్లి పేరు మీద ఒక చెట్టు'





కాకినాడ, మేజర్ న్యూస్ : జెఎన్‌టియుకె ప్రాంగణంలో సోమవారం యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కాకినాడ (యుసిఇకె) నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్‌సిసి) ఆధ్వర్యంలో 'తల్లి పేరు మీద ఒక చెట్టు' అనే నినాదంతో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం వద్ద మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఇన్‌ఛార్జి ఉపకులపతి ప్రొ.కెవిఎస్‌జి.మురళీకృష్ణ విచ్చేయగా గౌరవ అతిథులుగా రెక్టార్ ప్రొ.కెవి.రమణ, యుసిఇకె ప్రిన్సిపాల్ ప్రొ.ఎన్.మోహన్‌రావు, ఎన్‌సిసి ఆఫీసర్ బల్వాన్ సింగ్‌లు విచ్చేశారు. యుసిఇకె ఎన్‌సిసి కేర్ టేకర్ డా.టి.లక్ష్మణ కిశోర్ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి ఉపకులపతి ప్రొ.కెవిఎస్‌జి.మురళీకృష్ణ మాట్లాడుతూ తల్లి పేరు మీద మొక్కలను నాటడం అంటే తల్లిని పూజించడంతో సమానం అని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయ ప్రాంగణంలో అధిక సంఖ్యలో మొక్కలు నాటేందుకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. మొక్కలను నాటడం ద్వారా విశ్వవిద్యాలయ ప్రాంగణం అంతా పచ్చదనంతో కళకళలాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ప్రొ.కెవి.రమణ, యుసిఇకె ప్రిన్సిపాల్ ప్రొ.ఎన్.మోహన్‌రావు, ఎన్‌సిసి ఆఫీసర్ బల్వాన్ సింగ్, యుసిఇకె ఎన్‌సిసి కేర్ టేకర్ డా.టి.లక్ష్మణ కిశోర్, ఎస్ఎస్ఎస్ యూనిట్–1 ప్రోగ్రాం ఆఫీసర్ కె.రమణాజీ, ఎన్‌సిసి అధికారులు, ఎన్‌సిసి క్యాడెట్‌లు తదితరులు పాల్గొన్నారు.

## తైక్వాండోలో గోల్డ్ మెడల్స్ సాధించిన క్రీడాకారులు



**అంబాజీపేట, మేజర్ న్యూస్ :** స్థానిక శ్రీనివాస తైక్వాండో క్లబ్ విద్యార్థినిలు పలు విభాగాల్లో మూడు గోల్డ్ మెడల్స్, సిల్వర్, రెండు బ్రాంజ్ మెడల్స్ సాధించినట్లు తైక్వాండో సీనియర్ కోచ్ పితాని త్రిమూర్తులు తెలిపారు. మెడల్స్ సాధించిన క్రీడాకారులను అంబాజీపేట జెడ్పీ హైస్కూల్లో సోమవారం అభినందించారు. ఈ నెల 11వ తేదీన కాకినాడ జిల్లా స్టేడియంలో 30వ ఇంటర్ డిస్ట్రిక్ జూనియర్స్, సీనియర్స్ తైక్వాండో చాంపియన్ షిప్ పోటీలు జరిగాయని త్రిమూర్తులు తెలిపారు. ఈ పోటీలలో సీనియర్ విభాగంలో పితాని భార్గవి శ్రీకళ, కె.లక్ష్మిప్రసన్నలు గోల్డ్ మెడల్సును, కె.వినూత్న సిల్వర్ మెడలు, డి.రాఘవేంద్ర బ్రాంజ్ మెడల్స్ సాధించారన్నారు. జూనియర్ విభాగంలో ఎ.ఆదిత్య గోల్డ్, ఎ.బి.చైతన్య బ్రాంజ్ మెడల్స్ కైవసం చేసుకున్నారన్నారు. మెడల్స్ సాధించిన క్రీడాకారులను ఎస్సై కె.చిరంజీవి, ప్రధానోపాధ్యాయుడు కె.సాయిరామ్, ఎస్ఎంసీ చైర్మన్ పితాని త్రిమూర్తులు, పీడీ కె.ఆదిలక్ష్మి, పీఈటీ అందె సూర్యకుమారిలు అభినందించారు.

## అమరావతి జెఏసి అధ్యక్షుడుని కలసిన ఉద్యోగులు



**కాకినాడ, మేజర్ న్యూస్ :** ఏపీ జేఏసీ అమరావతి జిల్లా అధ్యక్షుడు పితాని త్రినాధరావు కాకినాడ రెవిన్యూ డివిజనల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా డివిజన్ క్లాస్ ఫోర్ ఎంప్లాయిస్, జూనియర్ అసిస్టెంట్ లు సోమవారం ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు. క్లాస్ ఫోర్ ఎంప్లాయిస్ జిల్లా అధ్యక్షులు ఎస్ చినపాపారావు, జాయింట్ సెక్రెటరీ ముంతాజ్, నాయకులు లక్ష్మి జానకి, ముక్తేశ్వరరావు, జూనియర్ అసిస్టెంట్స్ వి.గోపి, సత్యనారాయణ తదితరులు ఆయనను కలిసినవారిలో ఉన్నారు.

## వైద్య ఆరోగ్య శాఖ ప్రోగ్రాం అధికారులతో సమీక్షా సమావేశం

**– నులిపురుగుల దినోత్సవ గోడ పత్రిక ఆవిష్కరణ**



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** జిల్లా కలెక్టర్ వారి కార్యాలయంలో సోమవారం కోర్ట్ హాల్ నందు వైద్య ఆరోగ్య శాఖ ప్రోగ్రాం అధికారులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చెయ్యడం జరిగినది. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ వారు రాష్ట్ర స్థాయి జిల్లా కలెక్టర్ల సమావేశంలో చర్చించిన వైద్య ఆరోగ్య శాఖకు సంబందించిన విషయాలను ప్రోగ్రాం అధికారులందరికి తెలియజేసారు. జిల్లా కలెక్టర్ ప్రతీ వారం ప్రాధమిక వైద్య ఆరోగ్య కేంద్రం వైద్యదికారులతో సమీక్షా సమావేశం జరిపి జిల్లాలో అమలు అవుతున్న జాతీయా ఆరోగ్యకార్యక్రమాలు అమలు చెయ్యడంలో ఉన్న లక్ష్యాలను నూటికి నూరుశాతం అమలు చేసేవిధంగా ఈ సమావేశంలో తగు సూచనలు సలహాలు ఇస్తారు. సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. నరసింహ నాయక్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ వారితో జరగబోవు సమీక్షా సమావేశానికి తమకు నిర్దేశించిన లక్ష్యాలు మరియు సమాచారం తీసుకొని రావాలని తెలియజేసారు. ఈ సందర్భంగా ది. 20.08.2024 తేదిన జరగబోవు జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం గురించి గోడ పత్రికను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. తదనంతరం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారివారి కార్యాలయంలో వైద్య ఆరోగ్య శాఖ ప్రోగ్రాం అధికారులతో సమావేశం ఏర్పాటు చేసినారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ జెడ్ఎంవో డా. ఆర్.రమేష్, ఇన్ ఛార్జ్ డి.ఐ.ఒ డా. శ్రీనివాసా నాయక్. డిప్యూటీ డి.ఎం.హెచ్.ఒ. డా. పి.సరిత, ఇన్‌ఛార్జ్ డి.సి.ఆర్.బి.ఎస్.కె. డా.ఐ.ప్రభాకర్, డి.సి.ఎస్.ఆర్.ఎం.ఒ డా.పి.అనిత, ఐ.సి.డి.ఎస్పి.డి. ప్రవీణ, ఇన్‌ఛార్జ్ డి.పి.ఎం.ఒ. డా. సురేఖ మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శులకు గ్రామ పంచాయతీ విధులపై శిక్షణ

**అంబాజీపేట, మేజర్ న్యూస్ :** గ్రామ పంచాయతీ విధి విధానాలపై ఇస్తున్న శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకుని గ్రామాభివృద్ధికి పాటుపడాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. అంబాజీపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ జి.సరోవర్ అధ్యక్షతన సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు గ్రామ పంచాయతీ విధులపై సోమవారం శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ సరోవర్ పంచాయతీ నిర్వహించే బాధ్యతలు, పరిపాలన, అభివృద్ధి ప్రణాళికలు పై శిక్షణ ఇచ్చారు. అలాగే చెత్త నుండి సంపద కేంద్రాల నిర్వహణ, వాటి ఉపయోగాలను వివరించారు. మూడు రోజులు పాటి ఈ శిక్షణ జరుగుతుందాన్నారు. గ్రామాల్లో శానిటేషన్, అభివృద్ధి ప్రణాళికలపై ఈఓపీఆర్డీ బి.మమత శిక్షణ నిచ్చారు. శిక్షణా కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## పంచాయతీరాజ్ సమగ్ర శిక్షణా శిబిరం



సామర్లకోట,మేజర్ న్యూస్ : కాకినాడ జిల్లా సామర్లకోట మండల పరిషత్ కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలపై సర్పంచులు కార్యదర్శులకు ప్రత్యేక శిక్షణ శిబిరాన్ని సోమవారం ప్రారంభించారు. ఎంపీడీవో శ్యాంసుందర్, ఈవో పిఓపిఆర్డి కర్రీ హరికృష్ణ రెడ్డి ఆధ్వర్యంలో శిక్షణ ప్రారంచించి గ్రామాల్లో పారిశుధ్యం, వీధిలైట్ల నిర్వహణ, వీధి కుక్కల నివారణ, పంచాయతీకి కావలసిన నిధులు తదితర విధులకు సంబంధించి వివిధ అంశాలు దశలుగా మూడు రోజులపాటు శిక్షణ నిర్వహిస్తామని ఎంపీడీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనీలు నాగఫణి శ్రీహరిలు పాల్గొన్నారు. అంతకుముందు డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం కొరకు ప్రతిజ్ఞ నిర్వహించారు.

## నాట్య రవళి పురస్కారం అందుకున్న నరుకుల సాయిశ్రీప్రియ



పెరవలి, మేజర్ న్యూస్ : తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం ఖండవల్లి గ్రామానికి చెందిన ప్రముఖ నాట్య కళాకారిణి కుమారి నరుకుల సాయిశ్రీప్రియ ఆగస్టు 11వ తేదీ ఆదివారం రాత్రి తాడేపల్లిగూడెం లో బి.వి.ఆర్ కళా కేంద్రం వారిచే నాట్యరవళి పురస్కారాన్ని అందుకున్నారు.కళారంగంలో విశేష ప్రతిభను కనపరిచే వారికి అందించే ఈ పురస్కారాని తాడేపల్లిగూడెం పట్టణం బి.వి.ఆర్. కళాకేంద్రం లో జరిగిన కార్యక్రమంలో ఈ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు కళాప్రియ బుద్దాల వెంకట రామారావు మరియు కళా ప్రేమికులు, పట్టణ పుర ప్రముఖుల చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమానికి ముందుగా సాయిశ్రీప్రియ తన శిష్యబృంధం తో చేసిన శాస్త్రీయ నృత్యప్రదర్శనలు విచ్చేసిన కళాభిమానులను అలరించాయి.ఈ నృత్య ప్రదర్శనలో సరస్వతి, హాసిని, దేవి, రేణుక, హర్షిత, భువనేశ్వరి, వైష్ణవి, నాగ హర్షిత, కుసుమ, శ్వేత బృంధం చేసిన నృత్య ప్రదర్శనలకు ప్రేక్షకుల నుండి అభినంధనలు లభించాయి. నాట్య కళాకారుని నరుకుల సాయి శ్రీ ప్రియకు ఈ అవార్డు రావడం పట్ల ఖండవల్లి గ్రామ ప్రజలతో పాటు పెరవలి మండలానికి చెందిన ప్రముఖులు తమ అభినందనలు శుభాకాంక్షలు తెలియజేశారు.

# మంత్రి గారి ఇలాకా...అగ్రికల్చర్ ఏడి కార్యాలయం ఏది..?

**– పరిపాలనా అనుమతులు చాలు, ఉన్న సిబ్బంది చాలు**
**– ఆర్థిక అనుమతులు అవసరం లేదు**
**– గతంలో తణుకు.. ఇప్పుడు కొవ్వూరు..**
**– అందుబాటులో ఐఏఎల్ భవనం**

**పెరవలి, మేజర్ న్యూస్ :** దేశానికి రైతే వెన్నుముక అంటారు. ఆ వెన్నుముక వంటి రైతుకే సంబంధిత అగ్రికల్చర్ కార్యాలయాలకు వెళ్లాలంటే పెద్ద చిక్కు వచ్చి పడుతుంది. అధికారుల నిర్లక్ష్యం అయితే నేమి గత ప్రభుత్వ పాలకుల నిర్లక్ష్యమైతేనేమి ప్రజలకు అవసరమైన ఆఫీసులన్నీ సుదూర ప్రాంతాలలో కొనసాగుతున్న ప్రజలకు అందుబాటులోకి తేవాలనే ప్రజల ఆకాంక్షలు నెరవేరడం లేదు. వ్యవసాయ శాఖకు సంబంధించి అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయం జిల్లాల పునర్విభజనకు ముందు తణుకులో ఉండేది. జిల్లాల పునర్విభజన తర్వాత నిడదవోలు నియోజకవర్గం మొత్తం తూర్పు గోదావరి జిల్లాకు వెళ్లడంతో తణుకు పశ్చిమగోదావరి జిల్లాలో ఉండటంతో దగ్గరగా ఉన్న ఆఫీసులలో సేవలు పొందే రైతులు సుదూర ప్రాంతమైన కొవ్వూరు కు వెళ్ళవలసి వస్తుంది. కొవ్వూరు రెవెన్యూ




డివిజన్ మొత్తానికి 9 మండలాలకు సంబంధించి ఒకే ఒక్క అగ్రికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయం ఉండటంతో ఆ కార్యాలయం సిబ్బందికి రైతులకు కూడా ఇబ్బందిగా పరిగణించింది. గత ప్రభుత్వ హయాంలో నియోజకవర్గానికి ఒక అగ్రికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయం ఉండాలనే ప్రతిపాదన ఉంది. నిడదవోలులో అగ్రికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయానికి తాత్కాలికంగా ఉపయోగించుకునేందుకు అనువుగా ఇంటిగ్రేటెడ్ అగ్రికల్చర్ ల్యాబ్ భవనం బిల్డింగు అందుబాటులో ఉన్నప్పటికీ అధికారుల ముందు చూపు లేకపోవడంతో నిడదవోలులో అగ్రికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయం అనేది కలగా మిగిలింది. ఈ నిర్ణయానికి ఆర్థిక అనుమతులు ఏమీ అవసరం లేదని, అదనపు సిబ్బంది అవసరం లేకుండా అందుబాటులో ఉన్న సిబ్బందిని వినియోగించుకోవచ్చని పరిపాలన అనుమతులు ఒక్కటే చాలనే సంగతి నిడదవోలు శాసనసభ్యులు మరియు రాష్ట్ర పర్యాటక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ కు ఏ ఒక్క అధికారి చెప్పకపోవడం బాధాకరమని రైతులు వాపోతున్నారు. నిడదవోలులో అగ్రికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ వారి కార్యాలయం పెడితే నిడదవోలు, ఉండ్రాజవరం, పెరవలి మండలాల వ్యవసాయదారులకు చాలా దగ్గరగా అందుబాటులో కార్యాలయం ఉంటూ సేవలు అందుబాటులోకి వస్తాయని రైతులు పేర్కొంటున్నారు. ఈ విషయంపై మంత్రి దుర్గేష్ దృష్టిసారించి తమకు అందుబాటులో ఉండే విధంగా నిడదవోలు లో అగ్రికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయించాలని వారు కోరుతున్నారు.

## గ్రామ సర్పంచులకు రిఫ్రెషర్ శిక్షణా కార్యక్రమం

**దుమ్మా కొట్టిన సర్పంచులు**



**పి.గన్నవరం, మేజర్ న్యూస్ :** పి.గన్నవరం మండలం ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం మండలంలోని అందరు గ్రామ సర్పంచ్‌లకు మరియు గ్రామ కార్యదర్శులతో రిఫ్రెషర్ శిక్షణ తరగతులు ప్రారంభించారు. అయితే సోమవారం మధ్యాహ్నం నుండి శిక్షణ తరగతులకు ప్రజాప్రతినిధులు కనుచూపు మేరలో కనపడకుండా దుమ్మా కొట్టారు. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈకార్యక్రమానికిఈ విధంగా దుమ్మా కొట్టడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.మూడు రోజులు ఈ కార్యక్రమం జరగవలసి ఉండగా మొదటి రోజే దుమ్మా కొట్టడం విశేషం . బుధవారం వరకు మూడు రోజులు వారందరికీ రిఫ్రెషర్ శిక్షణా కార్యక్రమముపై గ్రామలలో జరిగే శానిటేషన్ మరియు వే స్ట్ మేనేజమెంట్, గ్రామ అభివృద్ధి ప్రణాళిలు పరిశీలన విధానం, వీధి లైటింగ్, గ్రామ పంచాయితీలలో ఎలక్ట్రిసిటీ బిల్లులు మెనేజ్మెంట్ పలు కార్యక్రమలపై సర్పంచ్ లకు మండలం ప్రజా పరిషత్ కార్యాలయంలో రిఫ్రెషర్ శిక్షణా కార్యక్రమము నిర్వహించవలసి ఉన్నది. ఈ కార్యక్రమానికి పి.గన్నవరం ఎం.ఎల్.ఎ గిడ్డి సత్యనారాయణ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఎంపిడిఓ త్రిశూల పాణి, అధికారులు ,ఎం.పి.పి. గనిశెట్టి నాగలక్ష్మి , ఈవోపీఆర్డీ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 16 అర్జీలు



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** సోమవారం పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమానికి 16 అర్జీలు వచ్చినట్లు ఆర్డీఓ కార్యాలయ ఇన్‌చార్జి ఏఓ ఎం.వి.భానుకుమార్ తెలిపారు. ఈ అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డివైఇఓ ఎన్.వెంకటేశ్వరరావు, డిఎల్‌పిఓ ఏఓ మైధిలి, ఎ.ఎస్.డబ్ల్యూ.ఓ వాణి, తూనికలు కొలతలు శాఖాధికారి మోహన్, ఇరిగేషన్ డిఇ శ్రీనివాస్, ఎస్‌టిఓ ఎండి.నజీరా బేగం, మున్సిపల్ సిబ్బంది దవులూరి రాజారావు, హౌసింగ్ ఏఇ రవిశంకర్, డివిజన్‌లోని వివిధ శాఖల డివిజన్ స్థాయి అధికారులు, దయానందరాజు, నారాయణ, అర్జీదారులు తదితరులు పాల్గొన్నారు.

## శృంగార వల్లభ స్వామివారిని దర్శించుకున్న నిమ్మకాయల రంగనాగ్ దంపతులు

**పెద్దాపురంరూరల్,మేజర్‌న్యూస్ :** పెద్దాపురం మండలంలో తిరుపతి



గ్రామంలో వేంచేసియున్న శ్రీశ్రీ శృంగార వల్లభ స్వామివారిని పెద్దాపురం శాసనసభ్యులు నిమ్మకాయల చినరాజప్ప తనయుడు నిమ్మకాయల రంగనాగ్ జన్మదినం సందర్భంగా సోమవారం కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు దేవస్థాన కార్యనిర్వాహణాధికారి వడ్డి శ్రీనివాసరావు, వేదపండితులు ఆధ్వర్యంలో స్వాగతం పలికి, స్వామివారి దర్శనం కల్పించి, వేద ఆశీర్వచనాలు అందజేసి, అనంతరం స్వామివారి చిత్రపటం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మొయిళ్ళ కృష్ణమూర్తి, ఎంపిటిసి పచ్చిపాల సతీష్, టిడిపి నాయకులు రాగాల ఉమ మహేశ్వరరావు, మత్తాల రాజు, కూటమి నాయకులు, వేదపండితులు పెద్దింటి నారాయణాచార్యులు, పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి గోపాలాచార్యులు, ఆలయ సిబ్బంది కృష్ణ, మోహనరావు, సత్యనారాయణ, తదితరులు ఉన్నారు.

## పెద్దాపురం నవోదయలో రీజనల్ కబడ్డి మీట్ ప్రారంభం

**– ముఖ్య అతిధిగా పాల్గొన్న ఎమ్మెల్యే చినరాజప్ప**



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** కాకినాడ జిల్లా పెద్దాపురంలో గల జవహర్ నవోదయ విద్యాలయలో సోమవారం రీజనల్ కబడ్డి మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పెద్దాపురం శాసనసభ్యులు నిమ్మకాయల చినరాజప్ప, పెద్దాపురం మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబురాజు ముఖ్య అతిధులుగా పాల్గొని రీజనల్ మీట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చినరాజప్ప మాట్లాడుతూ విద్యార్థులు ఎంతో చురుగ్గా క్రీడలలో పాల్గొంటే అంత ఆరోగ్యవంతమైన జీవితం అనుభవించగలరని పేర్కొన్నారు. ఈ విద్యాలయం కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్నప్పటికి తన వంతు సహాయ సహకారాలు ఎప్పుడు ఉంటాయని ఆయన తెలిపారు. మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబురాజు మాట్లాడుతూ నవోదయ విద్యాలయం పెద్దాపురం పట్టణంలో ఉండడం ఎంతో గర్వకారణమని, ఇక్కడ విద్యనభ్యసించిన విద్యార్థులు ఎక్కడెక్కడో మంచి ఉన్నత స్థానాలలో ఉన్నారని, తెలిపారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రామకృష్ణ విద్యాలయం గురించి, విద్యాలయ అభివృద్ధి గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వివిధ విద్యాలయాల నుంచి వచ్చిన క్రీడాకారులు, వారితో పాటు వచ్చిన ఎస్కార్ట్ టీచర్స్ సుమారు 550 మంది ఈ కబడ్డి మీట్‌లో పాల్గొనన్నున్నారని, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ తెలిపారు. పట్టణ టిడిపి కార్యదర్శి తూతిక రాజు, ఉపాధ్యాయులు ఆర్.సత్యనారాయణ, వి.జగన్మోహన్, కె.సుదీర్ కుమార్ మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# నిర్లక్ష్యానికి మూల్యం తప్పదు

**– రోడ్డు భద్రత పాటించాలి**



**కాకినాడ, మేజర్ న్యూస్ ప్రతినిధి :** జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు కాకినాడ డిఎస్‌పి డాక్టర్ కే. హనుమంతరావు పర్యవేక్షణలో సోమవారం ట్రాఫిక్ 1 పోలీసులు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. నగరంలోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్ విద్యార్థులకు ట్రాఫిక్ -1 ఇన్స్పెక్టర్ నూని రమేష్, ఎస్ఐలు, సిబ్బంది రోడ్ సేఫ్టీ ట్రాఫిక్ అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. రోడ్ యాక్సిడెంట్లను నిర్మూలిం చాలంటే వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సిఐ రమేష్ కోరారు. త్రాగి, మితిమీరిన వేగంతో వాహనాలు నడపడం వల్ల కలిగే నష్టాలను వివరించారు.అలాగే చాలామంది విద్యార్థులు బస్సులో ఖాళీ ఉన్నప్పటికీ లోపలికి వెళ్లకుండా ఫుట్ పాత్ ప్రయాణం చేయడం వల్లా ప్రమాదాల బారిన పడుతున్నారని తెలిపారు. విద్యార్థులు, పాదచారులు రోడ్డు పై జీబ్రా లైన్స్ లేని ప్రదేశాలలో రోడ్డును ఏవిధంగా దాటాలో సూచించారు. ద్విచక్ర వాహనాలపై ఇద్దరి కన్నా ఎక్కువమంది ప్రయాణించరాదనే విషయం గురించి తెలియచెప్పి వారిలో చైతన్యం తీసుకురావాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. కేవలం చిన్న చిన్న తప్పులు, నిర్లక్ష్యం వల్లే ప్రయాణాల సందర్భంగా అదేవిధంగా రహదారులలో నడుస్తున్నప్పుడు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వాహనం నడిపేవారు, అదేవిధంగా ప్రధాన రహదారులపై నడిచేవారు తమ ఇంటి వద్ద తమ కోసం ఎదురు చూసేవారు ఉంటారు అన్న విషయాన్ని గుర్తు పెట్టుకుంటే ఎలాంటి ప్రమాదాలు జరగవు అన్నారు. పోలీసులు జరిమానాలు రాసి వదిలేస్తారు అన్న భావం చాలా మందిలో ఏర్పడిందని, న్యాయస్థానాలు ఇలాంటి నిర్లక్ష్య డ్రైవింగ్ ను సీరియస్‌గా తీసుకుంటున్నాయని అన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిని పట్టుకున్నప్పుడు పదివేల జరిమానాతో పాటు జైలు శిక్ష కూడా విధిస్తున్నారని, ఇది దృష్టిలో పెట్టుకోవాలని సిఐ రమేష్ సూచించారు. కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, ఎస్ఐ లు పాల్గొన్నారు.

# బ్రాహ్మణుల ఐక్యతను చాటుదాము - పసుమర్తి



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** బ్రాహ్మణుల ఐక్యతను చాటుకోవడం ద్వారా అనేక సమస్యల పరిష్కారానికి కృషి చేయడానికి అవకాశముంటుందనిశ్రీ బ్రాహ్మణఅభివృద్ధి సమాఖ్య సేవాసంఘం అధ్యక్షులు పసుమర్తి సత్యనారాయణ మూర్తి అన్నారు. శ్రీ బ్రాహ్మణ అభివృద్ధి సమాఖ్య సేవా సంఘం నూతన కార్యాలయాన్ని స్దానిక అశోక్‌నగర్ లో ప్రారంబించారు. అనంతరం పూజాదికార్యక్రమాలు నిర్వహించారు.సభ్యులనుద్దేశించి పసుమర్తి మాట్లాడుతూ అన్నికార్యక్రమాలలో బ్రాహ్మణులు సేవలు కోరుకుంటారని అయితే వారి సమస్యలపట్ల ఎవ్వరు స్పందిచరని, దానివల్ల నిత్యమూ న్యూనతాభావానికి బ్రాహ్మణులు లోనవుతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. హిందువుల పట్ల జరుగుతున్న దాడులను ఎవ్వరూ ఖండించకపోవడం దురదృష్టకరమన్నారు.కార్యాలయ ప్రారంభోత్సవ సందర్భంగా ప్రత్యేక సర్టిఫికెట్‌లను ఆవిష్కరించారు. సంఘసభ్యులు రవికిషోర్ కుమార్తె ప్రదమ జన్మదినోత్సవ సందర్భంగా పది మంది పేదబ్రాహ్మణులకు నెలసరిపడా స్వయంపాక కిరాణా సామాన్లు పంపిణీ చేసారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు దివి శ్రీనివాస్ ఆచార్యులు, గరిమెళ్ళ లక్ష్మినారాయణ శర్మ, తనికెళ్ళ వెంకటరామయ్య శర్మ, ముఖ్య సలహాదారులు నాగ మహాశయా, ఎల్లాప్రగడ పద్మనాభ స్వామి, ఉపాధ్యక్షులు కడియాల సత్యనారాయణ మూర్తి, కార్యదర్శి పొద్దుతురి బాలాజి విశ్వనాద్, ఉప కార్యదర్శి మర్ల జగన్నాథ్ శర్మ, కోశధికారి కప్పగంతు సాయిరాం శర్మ, రాయుడుపాలెం దుర్గాప్రసాద్, లక్ష్మీనారాయణ, కల్లూరి రామకృష్ణ, కొంపెళ్ళ వెంకట సుబ్బారావు, పాండురంగ విఠల్, భమిడిపాటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# యువత దేశాభివృద్ధికి ఆదర్శం









కాకినాడ, మేజర్ న్యూస్ : స్థానిక సాంబమూర్తి నగర్‌లో గల ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో ఇంటర్నేషనల్ యూత్‌డే సందర్భంగా కళాశాల ప్రాంగణంలో కార్యక్రమం నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.కరుణ తెలిపారు. ఈ సందర్భంగా ఆదిత్య డిగ్రీ మరియు పి.జి. కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డా॥ బి.యి.వి.యల్ నాయుడు మాట్లాడుతూ ప్రతీ తరాన్ని ముందుకు నడిపించేది యువశక్తే అందుకే వారికంటూ ఓ రోజు కేటాయించాలని 1998 ఆగష్టు 12వ తేదిని అంతర్జాతీయ యూత్‌డే గా ప్రకటించారని తెలిపారు.కళాశాల ప్రిన్సిపాల్ కె.కరుణ మాట్లాడుతూ తమ కళాశాలలో ఎన్.ఎస్.ఎస్. వారు నిర్వహించిన 'ఇంటర్నేషనల్ యూత్ డే' కి ముఖ్య అతిధిగా రామకృష్ణమఠం, రాజమహేంద్రవరం నుంచి స్వామీజి సేవ్యానంద స్వామివారు విచ్చేసారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వామివారు విద్యార్థినులను ఉద్దేశించి, పాజిటివ్ థింకింగ్, మనస్సును, ఆలోచనలను ఎలా కంట్రోల్ చేయాలి, అనే ముఖ్య సందేశాన్ని అందించారని అన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న సేవ్యానందస్వామి మాట్లాడుతూ మహాత్మగాంధీ వంటి మహానేతలు 1921లో స్వామి వివేకానందను కలవడం జరిగిందని అన్నారు. ప్రతి వ్యక్తి ఒక లక్ష్యాన్ని పెట్టుకుని దానికోసం, ప్రయత్నిస్తే విజయం సాధ్యపడుతుందని అన్నారు. రోజు వారి దినచర్యలో పుస్తక పఠనం కూడా వుండాలని అన్నారు. మెదడును, ఆలోచనలను కంట్రోల్ చేసుకునే సాధనం పుస్తక పఠనం అన్నారు. విద్యార్థినీలకు వ్యక్తిగత వికాసం, ధైర్యం, అవసరమని తెలిపారు. విద్యార్థినులతో ప్లెడ్జ్ చేయించారు.ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి.నాగ శ్రీకాంత్, ఎన్.ఎస్. ఎస్. ప్రోగ్రాం ఆఫీసర్స్ పి.సురేఖ దేవి, ఫిజికల్ డైరెక్టర్ ఎన్.సత్యవతి, ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లు మరియు విద్యార్థినులు పాల్గొన్నారు.

## ప్రత్యేక మహిళా కారాగారమును సందర్శించిన హోంమంత్రి వంగలపూడి అనిత



రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ : ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత ప్రత్యేక మహిళా కారాగారమును సోమవారం సందర్శించారు. హెూమ్ మంత్రికి మహిళా కారాగారమునకు రాగానే మహిళా జైలు కానిస్టేబుల్స్ గార్డ్ ఆఫ్ హానర్ స్వీకరించి వారిని ప్రసంశించారు. అనంతరం హెూం మంత్రి జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి, జైళ్ల శాఖాధికారి కుమార్ విశ్వజీత్‌లతో కలిసి జైలు మొత్తం తిరిగి చూసారు. ఖైదీలను పలకరించి వారి క్షేమ సమాచారములు అడిగి తెలుసుకొన్నారు. ఖైదీల యొక్క భోజనం, ఇంటర్వ్యూలు, ఫోను సౌకర్యాల గురించి అడిగారు. ఖైదీల భోజనం రుచి చూసి బాగుందని చెప్పారు. ఖైదీలకు స్పెషల్ రెమిషన్ జీవో తొందరగా రావటానికి ప్రయత్నిస్తామని హెూమ్ మంత్రి చెప్పారు. జైలునందు బేకరి యూనిట్ తిరిగి చూసారు. ఇక్కడ చేసిన కేకు మొదలైనవి రుచి చూసి చాలా బాగున్నాయని వారిని ప్రశంసించారు. సిబ్బందిని కూడా పలుకరించి వారి యొక్క ఫెసిలిటీస్ గురించి అడిగారు. జైలు నందు సానిటరీ నాప్కిన్ మేకింగ్ మెషిన్ యూనిట్ ను ఏర్పాటు చేస్తామని చెప్పారు. జైలు మొత్తం చాల ఆహ్లాద కరమైన వాతావరణం కలిగి ఉన్నదని, చాలా శుభ్రంగా ఉందని తెలిపారు. మంత్రితో పాటు ఏపి జైళ్ళ సంస్కరణల మరియు సర్వీసుల విభాగము, జైళ్ల శాఖాధికారి కుమార్ విశ్వజీత్, కోస్తా ఆంధ్ర ప్రాంతము, రాజమహేంద్రవరం జైళ్ల ఉపశాఖాధికారి ఎం. ఆర్. రవికిరణ్, తూర్పు గోదావరి జిల్లా కలెక్టరు ప్రశాంతి, శాసన సభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాసు, గోరంట్ల బుచ్చియ్యచౌదరి , తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ డి. నరసింహా కిషోర్, కేంద్ర కారాగారము పర్యవేక్షణాధికారి ఎస్. రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

## అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎంఈఓకు మరలా పోస్టింగ్ ఇవ్వటం దారుణం యుటిఎఫ్ శాఖ




**కూనవరం, మేజర్ న్యూస్ :** కూనవరం మండల విద్యాశాఖాధికార మరోసారి ఆర్థిక పరమైన ఆరోపణలు ఎదుర్కొని రెండు సార్లు సస్పెండ్ అయిన వి.లక్ష్మీనారాయణ ని అందలం ఎక్కించుట వలన విలీన మండలాల్లో మరోసారి అనేక ఆర్థిక నేరాలకు పాల్పడే అవకాశం ఉందని, గతంలో అనేకసార్లు ఆర్థిక పరమైన ఆరోపణలు ఎదుర్కొని రెండు సార్లు సస్పెండ్ అయ్యి ఇంతా వరకు ఆర్థిక పరమైన విషయంలో ఎటువంటి రికవరీ చర్యలు తీసుకోకుండా మరలా నాలుగు మండలాల్లో మరోసారి ఇంచార్జీ విద్యాశాఖ అధికారిగా నియమించడంలో ఆంతర్యం ఏమిటనీ? యు.టి.ఎఫ్. కూనవరం మండల అధ్యక్ష/ప్రధాన కార్యదర్శులు ఎ.నాగేశ్వరరావు, పి.కన్నారావు ప్రశ్నించారు.అదే విధంగా అమలాపురం లో జరిగిన రాష్ట్ర విద్యా సదస్సులో అతని అవినీతి ఆరోపణలు పై అల్లూరి సీతారామరాజు జిల్లా డి.ఇ.ఒ గారికి ఫిర్యాదు చేస్తూ యు.టి.ఎఫ్. అల్లూరి సీతారామరాజు జిల్లా అధ్యక్ష/ప్రధాన కార్యదర్శులు గారికి ప్రాతినిధ్యం చేయాలని కోరడం జరిగిందని,తక్షణమే మరోసారి విచారణ జరిపి ఆర్థిక పరమైన వ్యక్తి గత భీమా పాలసీలకు సంబంధించిన డబ్బులు,పాఠశాల గ్రాంట్స్, కాంప్లెక్స్ గ్రాంట్స్ రికవరీ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ఉపాధ్యాయుల పని సర్దుబాటు ప్రక్రియ రద్దు చేయాలి



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** ఉపాధ్యాయుల పని సర్దుబాటు ప్రక్రియ చాలా అసంబద్ధాలతో కూడుకొని ఉన్నది .ఉపాధ్యాయ సంఘాలుగా చెప్పినటువంటి ఏ అంశాన్ని పరిగణనలోకి తీసుకోకుండా ,ఏకపక్షంగా రాష్ట్ర విద్యాశాఖ ఈ ప్రక్రియను సోమవారం అత్యవసరంగా చేపడుతుంది. దీన్ని నిరసిస్తూ రాష్ట్ర ఫ్యాప్టో పిలుపు మేరకు సోమవారం జరిగే కౌన్సిలింగ్ ని అన్ని మండలాల్లో బాయ్కాట్ చేస్తున్నామని తెలియజేస్తున్నాము. ఈ మేరకు మండల విద్యాశాఖాధికారి శివ రామ కృష్ణయ్య గారికి యుటిఎఫ్ శాఖ తరఫున వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు ఎస్వీ రామారెడ్డి ఎంబిఎన్ దేవి నక్కిన నాగరాజు వి సుబ్రహ్మణ్యం తదితరులు వినతిపత్రం అందించిన వారిలో ఉన్నారు.

## ముక్కామల, తీపర్రు గ్రంథాలయాల్లో ఘనంగా స్వామినాథన్ జన్మదిన వేడుకలు



పెరవలి, మేజర్ న్యూస్ : పెరవలి మండలం శాఖ గ్రంధాలయంలో ఆగస్టు 12వ తేదీ సోమవారం పద్మశ్రీ ఎస్ఆర్ రంగనాథన్ జయంతి కార్యక్రమం ఘనంగానిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగాఎస్ ఆర్ రంగనాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించడం జరిగినది ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు గ్రంథ పాలకురాలు శ్రీమతి సిహెచ్ వెంకట జయలక్ష్మి పాల్గొన్నారు. ముక్కామల శ్రీ ఇనుప కోళ్ల రాఘవరావు మెమోరియల్ శాఖా గ్రంథాలయంలో ఎస్ ఆర్ రంగనాథన్ జయంతి (లైబ్రెరియన్స్ డే) కార్యక్రమం ఆగస్టు 12వ తేదీ సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకుడు మల్లిపూడి వెంకటేశ్వరరావు రీడర్స్ ఫారం సభ్యులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.